# విశాల భారతి

తెలుగు దినపత్రిక

23-03-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ | సంపుటి:4 సంచిక: 78


## నరేంద్ర మోదీ అరుదైన రికార్డు

చరిత్ర సృష్టించిన పీఎం నరేంద్ర మోదీ

అత్యధిక కాలం పనిచేసిన నాయకుడిగా రికార్డ్

ప్రశంసల వర్షం కురిపించిన మంత్రులు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ఒక అద్భుతమైన మైలురాయిని చేరుకున్నారు. ఒక ప్రభుత్వానికి అత్యధిక కాలం అధిపతిగా పనిచేసిన నాయకుడిగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. గతంలో సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న 8,930 రోజుల రికార్డును మోదీ అధిగమించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానిగా కలిపి ఆయన ఇప్పటివరకు 8,931 రోజులు పదవిలో కొనసాగి చరిత్ర పుటల్లో నిలిచారు. ఈ సందర్భంగా కేంద్ర మిగతా 4లో..

## ఇండ్లు కూల్చి విగ్రహాలు నిర్మిస్తే సహించం

- మూసీ పునరుజ్జీవం పేరిట పేదల ఇళ్లు కూల్చడాన్ని సహించం
- అభివృద్ధి ముసుగులో అవినీతికి పాల్పడితే చూస్తూ ఊరుకోం
- గంగా నది శుద్ధికే రూ. 20 వేల కోట్లు.. మూసీకి లక్షల కోట్లు ఎందుకని ప్రశ్న
- బాధితులకు పునరావాసం కల్పించిన తర్వాతే ప్రాజెక్టుల గురించి మాట్లాడాలి
- బఫర్ జోన్ నిబంధనల్లో సామాన్యులకు ఒకలా, పెద్దలకు మరోలా ఉంది
- నదుల అనుసంధానంపై అంబేద్కర్ అప్పట్లోనే దూరదృష్టితో ఆలోచించారు



విశాలభారతి, స్టేట్ బ్యూరో: తెలంగాణలో చర్చనీయాంశంగా మారిన మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్టుపై భారతీయ జనతా పార్టీ తన గళాన్ని విప్పింది. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రతిపాదించిన గాంధీ సరోవర్ నిర్మాణంపై అనేక సందేహాలు మిగతా 3లో..



# అన్నదాతకు రేవంత్ భరోసా

### 70 లక్షల మంది రైతులకు రూ. 3,600 కోట్ల రైతుభరోసా విడుదల

సోమవారం నాటికే నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ

సిద్దిపేట జిల్లా నర్మెట్టలో అత్యాధునిక ఫ్యాక్టరీ ప్రారంభం




మరో 45 రోజుల్లో మిగిలిన రూ. 5,400 కోట్లు విడుదల చేస్తామని వెల్లడి

వరిపైనే కాకుండా పామాయిల్ వంటి లాభసాటి పంటల వైపు మళ్లాలని పిలుపు

2029లో సిద్ధిపేట నుండి గెలిచే నేతకు మంత్రి పదవి ఇస్తానని హామీ

**తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదివారం సిద్దిపేట జిల్లా నర్మెట్ట వేదికగా రాష్ట్ర రైతులకు అదిరిపోయే గుడ్ న్యూస్ చెప్పారు. సాగు పెట్టుబడి కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలకు ఊరటనిస్తూ సుమారు 70 లక్షల మంది రైతులకు రూ. 3,600 కోట్ల రైతుభరోసా నిధులను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా నర్మెట్టలో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించిన సీఎం, ఈ కర్మాగారాన్ని రైతులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించి వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపారు. ఈ నిధులు కేవలం ఒక రోజు వ్యవధిలోనే, అంటే సోమవారం నాటికే నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని స్పష్టం చేయడం విశేషం. అంతేకాకుండా మరో 45 రోజుల్లో మిగిలిన రూ. 5,400 కోట్లు కూడా విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందని, రైతుల కళ్లల్లో ఆనందం చూడటమే తమ అసలు లక్ష్యమని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. గత రెండేళ్ల కాలంలో వ్యవసాయ రంగం కోసం ప్రతి నెలా సగటున రూ. 5,500 కోట్లు ఖర్చు చేస్తున్నామని ఆయన గణాంకాలతో సహా వివరించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల, ముఖ్యంగా అకాల వర్షాలు, వడగండ్ల వానల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి తమ ప్రభుత్వం ఏకంగా రూ. 1.40 లక్షల కోట్లు వ్యయం చేసినట్లు గుర్తుచేశారు. రైతును నిజమైన రాజుగా చేయడమే తమ అంతిమ ఆశయమని, అందుకే పంటలకు మద్దతు ధరతో పాటు అదనంగా రూ. 500 బోనస్ అందిస్తున్నామని ఆయన గర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలో పంటల సాగు విధానంలో మార్పులు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం తెలంగాణలో పామాయిల్ సాగు విస్తీర్ణం 3 లక్షల మిగతా 3లో..



## తెలంగాణ పరువు తీయొద్దు!

- ఇక్రిశాట్‌ను అమెరికా సంస్థ అనడం రేవంత్ రెడ్డి అజ్ఞానానికి పరాకాష్ట
- ప్రపంచ బ్యాంకు, యూఎన్ సహకారంతో నడిచే అంతర్జాతీయ పరిశోధనా సంస్థ
- కనీస అవగాహన లేని వ్యాఖ్యలతో తెలంగాణ గౌరవాన్ని పణంగా పెట్టవద్దు
- నదీ జలాలు, అటవీ ప్రాంతాలపై గతంలో ఇలాగే తప్పగా మాట్లాడారు
- అంతర్జాతీయ సంస్థలను కించపరిస్తే రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు రావు
- వాస్తవాలు తెలుసుకున్నాకే సీఎం హోదాలో బహిరంగంగా మాట్లాడాలి

02



## యుద్ధం వచ్చినా భారత్ సేఫ్

- ఇంధన కొరత రాకుండా ప్రధాని మోదీ ఉన్నత స్థాయి సమీక్ష
- గల్ఫ్ దేశాలతో చర్చలు, ప్రత్యామ్నాయ మార్గాలపై ఫోకస్
- కేవలం 10 రోజుల్లోనే పీఎన్‌జీ కనెక్షన్లు ఇచ్చేలా ఆదేశం
- రష్యా, అమెరికా నుండి భారత్‌కు చేరుతున్న చమురు, గ్యాస్ నౌకలు
- మంగళూరు పోర్టుకు 72 వేల టన్నుల గ్యాస్.. కొరత ఉండదని వెల్లడి
- అంతర్జాతీయంగా రేట్లు పెరిగినా, సామాన్యుడిపై భారం పడకుండా నిల్వలు

**విశాలభారతి, అంతర్జాతీయం:** పశ్చిమాసియాలో కమ్ముకున్న యుద్ధ మేఘాలు ప్రపంచ ఇంధన మార్కెట్‌ను కుదిపేస్తున్న వేళ.. భారత్ అప్రమత్తమైంది. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ముదురుతున్న ఉద్రిక్తతలు అంతర్జాతీయంగా చమురు సరఫరా వ్యవస్థకు సవాలుగా మారడంతో ప్రధాని నరేంద్ర మోదీ రంగంలోకి దిగారు. దేశంలో పెట్రోలియం, విద్యుత్, ఎరువుల రంగాలపై ఈ ప్రభావం పడకుండా ఉండేందుకు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. దేశ రాజధానిలో జరిగిన ఈ కీలక భేటీలో అమిత్ షా, నిర్మలా సీతారామన్, ఎస్. జైశంకర్ వంటి సీనియర్ మంత్రులతో పాటు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ కూడా పాల్గొన్నారు. మిగతా 2లో..

## 17 మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తాం




- 26వేల కొత్త బెడ్లు, 17 మెడికల్ కాలేజీలు ఈ ఏడాది నుంచే ప్రారంభం
- నియోజకవర్గానికి 1000 ఇందిరమ్మ ఇళ్లు; సోమవారం బిల్లుల చెల్లింపు
- 69 లక్షల మంది రైతులకు రూ. 3,446 కోట్లు విడుదల
- 100శాతం సబ్సిడీతో 6.70 లక్షల ఎకరాలకు సాగునీరు
- రహదారులకు రూ. 13,500 కోట్లు, గోదావరి పుష్కరాలకు రూ. 440 కోట్లు

02

## శత్రువులకు నో ఎంట్రీ

- 48 గంటల్లో జలసంధి తెరవాలి, లేదంటే పవర్ ప్లాంట్లపై బాంబులే
- యుద్ధం వద్దు, శాంతి ముద్దు అంటూ వాణిజ్య నౌకలకు గ్రీన్ సిగ్నల్
- శత్రువుల నౌకలు తప్ప, మిగిలిన అందరికీ అనుమతి
- ఇరాన్‌ను చీకట్లోకి నెట్టేలా అతిపెద్ద విద్యుత్ కేంద్రంపై కన్నేసిన ట్రంప్
- సార్వభౌమత్వాన్ని గౌరవిస్తేనే, రూల్స్ పాటిస్తామని ఇరాన్ స్పష్టీకరణ

**విశాలభారతి, అంతర్జాతీయం:** పర్షియన్ గల్ఫ్ ప్రాంతం మరోసారి రణరంగాన్ని తలపిస్తోంది. ప్రపంచ చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి వేదికగా అగ్రరాజ్యం అమెరికా, ఇరాన్ మధ్య ముదిరిన వివాదం ఇప్పుడు క్లైమాక్స్‌కు చేరుకుంది. జలసంధిని తక్షణమే బేషరతుగా తెరవాలని, లేదంటే ఊహించని పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన అల్టిమేటం ప్రపంచ దేశాలను ఉలిక్కిపడేలా చేసింది. మిగతా 3లో..



## అవమానాలు ఇక చాలు



- ఈ నెల 25న కాంగ్రెస్ పార్టీకి జీవన్‌రెడ్డి రాజీనామా
- గత 20 నెలలుగా పార్టీలో జరుగుతున్న అవమానాలు
- తన నిర్ణయాన్ని వివరిస్తూ అనుచరులకు, కార్యకర్తలకు లేఖ
- రాజకీయంగా ఇబ్బందికర పరిస్థితులు సృష్టిస్తున్నారు
- కార్యకర్తలతో చర్చించిన తర్వాతే భవిష్యత్ కార్యాచరణ వెల్లడి
- జీవన్‌రెడ్డి ఏ పార్టీలో చేరుతారనే అంశంపై జిల్లాలో తీవ్ర చర్చ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, జగిత్యాల రాజకీయ ధ్రువతారగా పేరుగాంచిన మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి తీసుకున్న తాజా నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. గత కొన్ని దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండాను మోస్తూ, కష్టకాలంలోనూ పార్టీ వెంటే నడిచిన ఆయన, ఇప్పుడు హస్తం పార్టీకి హ్యాండ్ ఇవ్వాలని నిర్ణయించుకోవడం రాజకీయ వర్గాలను దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. గత 20 నెలలుగా తాను పార్టీలో ఎదుర్కొంటున్న అవమానాలు, అనుభవిస్తున్న మానసిక క్షోభ వర్ణనాతీతమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ఈ పరిస్థితుల్లో కొనసాగడం తన వల్ల కాదని తేల్చిచెప్పిన జీవన్ రెడ్డి, ఈ నెల 25న పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించడంతో జగిత్యాల కోటలో ప్రకంపనలు మొదలయ్యాయి. తన రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూసిన జీవన్ రెడ్డి, తన ఆవేదనను వెళ్లగక్కుతూ జగిత్యాల జిల్లాలోని తన ముఖ్య అనుచరులకు, కార్యకర్తలకు ఒక భావోద్వేగపూరితమైన లేఖ రాశారు. మిగతా 2లో..

## నా కుటుంబాన్ని రక్షించండి

- తనకు, తన కుటుంబానికి ప్రాణ ముప్పు ఉంది.
- నిరంతరం బెదిరింపులు వస్తున్నాయని పేర్కొన్నారు
- పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదు
- భద్రత కోసం ఇది తన చివరి లేఖ అని స్పష్టం చేశారు
- తనను తాను కాపాడుకోవడానికి ఆయుధం పడతాను
- రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదు కాబట్టి కేంద్రం రక్షణ కల్పించాలి


**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు అత్యంత కీలకమైన లేఖ రాశారు. తనతో పాటు తన కుటుంబ సభ్యుల ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పును వివరిస్తూ రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గత కొంతకాలంగా గుర్తు తెలియని వ్యక్తుల నుంచి తనకు నిరంతరం బెదిరింపు కాల్స్, లేఖలు అందుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తనను మిగతా 3లో..



## తెలంగాణ కొత్త బిల్డింగ్ రూల్స్

- 21 మీటర్లు దాటితే అది హైరైజ్ భవనమే
- రోడ్డు వెడల్పును బట్టి 3 నుండి 5 అంతస్తుల దాకా ఛాన్స్
- 10 అంతస్తులు దాటితే టీడీఆర్ వాడకం తప్పనిసరి
- సెట్‌బ్యాక్ ఖాళీ స్థలంలో 10శాతం మినహాయింపు
- 20 అంతస్తుల పైబడిన భవనాలకు 5శాతం టీడీఆర్
- టీడీఆర్ ఫీజు సగం మొదట, సగం చివర్లో కట్టవచ్చు

03



# 17 మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తాం

- 26వేల కొత్త బెడ్లు, 17 మెడికల్ కాలేజీలు ఈ ఏడాది నుంచే ప్రారంభం
- నియోజకవర్గానికి 1000 ఇందిరమ్మ ఇళ్లు; సోమవారం బిల్లుల చెల్లింపు
- 69 లక్షల మంది రైతులకు రూ. 3,446 కోట్లు విడుదల
- 100శాతం సబ్సిడీతో 6.70 లక్షల ఎకరాలకు సాగునీరు
- రహదారులకు రూ. 13,500 కోట్లు, గోదావరి పుష్కరాలకు రూ. 440 కోట్లు
- బ్రేక్‌ఫాస్ట్‌లో పౌష్టికాహారం, ఏటీసీ విద్యార్థులకు రూ. 2000 స్కాలర్‌షిప్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ గడ్డపై జన్మించడం ప్రతి పౌరుడు గర్వకారణంగా భావించేలా రాష్ట్ర బడ్జెట్‌ను తీర్చిదిద్దామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మంలోని కాంగ్రెస్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలను, ప్రవేశపెట్టిన పథకాల విశిష్టతను వివరించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి భరోసా కల్పించడమే ధ్యేయంగా పాలన సాగుతోందని స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా పరుగులు తీయిస్తూ ప్రజా పాలనను సాకారం చేస్తున్నామని ఆయన ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచేందుకు ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. కులమతాలకు, ప్రాంతీయ భేదాలకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తిస్తుందని వివరించారు. సామాన్యుడి ప్రాణానికి రక్షణ కల్పించడమే ఈ బీమా ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో నిర్లక్ష్యానికి గురైన రంగాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. ప్రజల అవసరాలను గుర్తించి రూపొందించిన ఈ బడ్జెట్ రాష్ట్ర భవిష్యత్తుకు దిక్సూచిలా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ ఏడాది కొత్తగా నిర్మిస్తున్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో సుమారు 14 వేల పడకలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. వీటితో పాటు ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లో మరో 12 వేల పడకలను సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. పేదలకు మెరుగైన వైద్యం చేరువ చేయడమే లక్ష్యంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ఆరోగ్య తెలంగాణ నిర్మాణంలో భాగంగా వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రంలో వైద్య విద్యను ప్రోత్సహించేందుకు ఈ ఏడాది నుంచే 17 కొత్త మెడికల్ కాలేజీలను ప్రారంభించబోతున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. దీనివల్ల స్థానిక విద్యార్థులకు డాక్టర్లు అయ్యే అవకాశం పెరగడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల లభ్యత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల ఆరోగ్యంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని చెప్పారు. పాఠశాల విద్యార్థులకు వారంలో ఆరు రోజుల పాటు పౌష్టికాహారంతో కూడిన అల్పాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు శారీరకంగా, మానసిక దృఢంగా ఎదిగినప్పుడే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తామని భట్టి హామీ ఇచ్చారు. నియోజకవర్గానికి వెయ్యి ఇళ్ల చొప్పున ఈ ఏడాది మంజూరు చేయాలని నిర్ణయించామన్నారు. ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి సోమవారం క్రమం తప్పకుండా బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. గృహ నిర్మాణ రంగంలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, అర్హులైన వారందరికీ గూడు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని వివరించారు. నిధుల కొరత లేకుండా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. వ్యవసాయ కూలీలకు స్థానికంగానే పని కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. యువతకు సాంకేతిక విద్యను అందించే ఏటీసీల్లో చదువుకునే విద్యార్థులకు నెలకు రెండు వేల రూపాయల చొప్పున స్కాలర్‌షిప్ అందించనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఎంతో ఊరట లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

అన్నదాతల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతు భరోసా నిధుల విడుదలకు శ్రీకారం చుట్టామన్నారు. సుమారు 69 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి 3446.94 కోట్ల రూపాయలను జమ చేస్తున్నట్లు తెలిపారు. కేవలం 45 రోజుల వ్యవధిలోనే మూడు విడతల్లో రైతులందరికీ ఈ నిధులు అందుతాయని భరోసా ఇచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతు సంక్షేమం కోసం యుద్ధ ప్రాతిపదికన నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. సాగు పెట్టుబడి కోసం రైతులు ఇబ్బంది పడకుండా సమయానికే నిధులు అందజేస్తామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రహదారుల అభివృద్ధికి 13,500 కోట్ల రూపాయలను కేటాయించినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రతి గ్రామానికి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం ద్వారా గ్రామీణ ప్రగతికి బాటలు వేస్తున్నామని చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పనలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. రహదారులు బాగుంటేనే వాణిజ్యం, రవాణా మెరుగుపడి గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఈ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులన్నీ పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

గిరిజన రైతుల అభ్యున్నతి కోసం 'ఇందిరా సౌర గిరి జల వికాసం' అనే సరికొత్త పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. వంద శాతం సబ్సిడీతో గిరిజనుల భూములను సాగులోకి తీసుకురావడమే ఈ పథకం లక్ష్యమని వివరించారు. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 6.70 లక్షల ఎకరాల గిరిజన భూములకు సాగునీరు అందుతుందని చెప్పారు. ప్రకృతి వనరులను ఉపయోగించుకుంటూ సౌర విద్యుత్ ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అట్టడుగు వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఇదే నిదర్శనమని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో మొదటిసారిగా గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం 440 కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించిందని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసేందుకు క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కమిటీ ఆధ్వర్యంలో పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని చెప్పారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూనే, భక్తుల రక్షణ, సౌకర్యాల విషయంలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. గోదావరి తీర ప్రాంతాల్లో ఘాట్ల నిర్మాణం, ఇతర వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని, ముఖ్యంగా ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు భారీ ప్రణాళికలు రూపొందించామన్నారు. బాసర సరస్వతీ క్షేత్రం నుంచి భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవాలయం వరకు 'టెంపుల్ టూరిజం' సర్క్యూట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించారు. దీనివల్ల రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వచ్చే యాత్రికుల సంఖ్య పెరగడమే కాకుండా స్థానికులకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఈ ప్రాజెక్టు ఉంటుందని భట్టి విక్రమార్క వివరించారు. ప్రజా హితమే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన పునరుద్ఘాటించారు.

# అవమానాలు ఇక చాలు

**మొదటిపేజీ తరువాయి**

"అవమానాలు భరిస్తూ పార్టీలో కొనసాగలేను" అంటూ ఆయన రాసిన వాక్యాలు ఆయన ఎంతటి మానసిక సంఘర్షణకు లోనయ్యారో స్పష్టం చేస్తున్నాయి. పార్టీలో తనను రాజకీయంగా ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా కొందరు పని చేస్తున్నారని, సొంత పార్టీలోనే పరాయివాడిలా బతకడం తన ఆత్మగౌరవానికి దెబ్బ అని ఆయన పేర్కొన్నారు. దశాబ్దాల కాలం పాటు నీతిగా, నిజాయితీగా రాజకీయాలు చేసిన తనకు చివరి దశలో ఇలాంటి పరిస్థితులు ఎదురుకావడం అత్యంత బాధాకరమని ఆయన వాపోయారు. జగిత్యాల ప్రాంతంలో జీవన్ రెడ్డికి ఉన్న ఫాలోయింగ్, ఆయన కీర్తి ప్రతిష్టలు సామాన్యమైనవి కావు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో ఆయన ఒక శక్తిగా ఎదిగారు. అలాంటి నేత పార్టీని వీడటం అంటే అది కేవలం ఒక వ్యక్తి రాజీనామా మాత్రమే కాదు, ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్ కోట కూలిపోవడానికి సంకేతమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే ఒక సీనియర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ హోదాలో ఉన్న నాయకుడు ఇంతటి తీవ్ర నిర్ణయం తీసుకున్నారంటే, పార్టీ అంతర్గత వ్యవహారాలు ఎంతలా దిగజారాయో అర్థం చేసుకోవచ్చు. అధిష్ఠానం జోక్యం చేసుకున్నప్పటికీ ఆయన మనసు మార్చుకోలేదంటే పరిస్థితి ఎంత ముదిరిపోయిందో ఇక్కడ స్పష్టమవుతోంది. ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత జగిత్యాలలో మారుతున్న రాజకీయ సమీకరణాలు జీవన్ రెడ్డిని తీవ్ర అసంతృప్తికి గురిచేశాయి. పార్టీలోకి కొత్తగా చేరిన నాయకులకు ప్రాధాన్యత ఇస్తూ, దశాబ్దాలుగా నమ్ముకున్న తనను పక్కన పెట్టడం ఆయనకు మింగుడుపడటం లేదు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని భావించే ఆయనకు, పార్టీలో గౌరవం లేకపోవడం అనేది పెద్ద దెబ్బగా తగిలింది. తన నియోజకవర్గంలో తన ప్రమేయం లేకుండానే నిర్ణయాలు జరగడం, తన అనుచరులను ఇబ్బంది పెట్టడం వంటి అంశాలు ఆయనను తీవ్ర నిర్ణయం వైపు పురికొల్పాయి. ఈ నేపథ్యంలోనే ఆయన కార్యకర్తల తోడు, మార్గదర్శనం కోరుతూ లేఖ రాయడం గమనార్హం. ఈ నెల 25వ తేదీన రాజీనామా చేసిన తర్వాత ఆయన భవిష్యత్తు కార్యాచరణ ఏమిటన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఇప్పటికే జగిత్యాల జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఆయన ఏ పార్టీలోకి వెళ్తారు? లేక సొంతంగా ఏదైనా నిర్ణయం తీసుకుంటారా? అన్నది చర్చనీయాంశమైంది. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నేత అడుగులు ఎటువైపు ఉంటాయోనని ప్రత్యర్థి పార్టీలు కూడా ఆసక్తిగా గమనిస్తున్నాయి. ఆయన తన అనుచరులు, కార్యకర్తలతో విస్తృతంగా సమావేశమై, వారి సలహాలు, సూచనలు తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం ప్రకటిస్తానని స్పష్టం చేశారు. నాయకుడి అడుగుజాడల్లో నడిచేందుకు సిద్ధంగా ఉన్న వేలాది మంది కార్యకర్తలు ఇప్పుడు ఆయన పిలుపు కోసం ఎదురుచూస్తున్నారు. నేటి తరం రాజకీయాల్లో విలువల కంటే పదవులకే ప్రాధాన్యత ఉంటుందని చాలామంది అంటుంటారు. కానీ జీవన్ రెడ్డి తన ఆత్మగౌరవం కోసం పదవిని, పార్టీని త్యాగం చేయడానికి సిద్ధపడటం ఒక విలక్షణమైన అంశం. యువత రాజకీయాల్లోకి వస్తున్న ఈ కాలంలో, ఒక సీనియర్ నేత తన గౌరవం కోసం పోరాడటం అనేది ఒక పాఠంలాంటిది. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు లభించనప్పుడు, అక్కడ ఉండటం కంటే బయటకు వచ్చి తన సత్తా చాటడమే సరైనదని ఆయన భావిస్తున్నారు. జగిత్యాల ప్రజలతో ఆయనకు ఉన్న పేగు బంధం కేవలం ఒక పార్టీకే పరిమితం కాదు, అది ఒక వ్యక్తిగత అనుబంధం. ఆ నమ్మకమే ఆయనను ఈ సాహసోపేత నిర్ణయం తీసుకునేలా చేసింది. జగిత్యాల రాజకీయ చరిత్రలో జీవన్ రెడ్డి ఒక చెరగని ముద్ర వేశారు. ఆయన మంత్రిగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులు నేటికీ ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నాయి. అలాంటి నేతను కాంగ్రెస్ పార్టీ సరిగ్గా వాడుకోలేకపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సీనియార్టీని గౌరవించడంలో విఫలమైతే ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందో జీవన్ రెడ్డి రాజీనామా రూపంలో కాంగ్రెస్ పార్టీకి ఒక హెచ్చరికలా కనిపిస్తోంది.



# తెలంగాణ పరువు తీయొద్దు!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావు ధ్వజమెత్తారు. అంతర్జాతీయ స్థాయిలో ఎంతో గుర్తింపు పొందిన ఇక్రిశాట్ పరిశోధనా సంస్థపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు ఆయన అజ్ఞానాన్ని సూచిస్తున్నాయని మండిపడ్డారు. దశాబ్దాల చరిత్ర కలిగిన ఒక ప్రతిష్ఠాత్మక సంస్థను కేవలం ఒక దేశానికి పరిమితం చేస్తూ మాట్లాడటం శోచనీయమని పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి వాస్తవాలను వక్రీకరించడం రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చడమేనని హరీశ్ రావు తీవ్రంగా ఆక్షేపించారు. హైదరాబాద్ శివార్లలోని పటాన్‌చెరు వేదికగా 1972 నుంచి సేవలు అందిస్తున్న ఇక్రిశాట్‌ను అమెరికా సంస్థగా అభివర్ణించడంపై ఆయన విస్మయం వ్యక్తం చేశారు. కనీస అవగాహన లేకుండా పబ్లిక్ వేదికలపై మాట్లాడి తెలంగాణ గౌరవాన్ని పక్క రాష్ట్రాల ముందు, అంతర్జాతీయ సమాజం ముందు పణంగా పెట్టవద్దని హితవు పలికారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో సీఎం తీరును ఎండగడుతూ పలు అంశాలను ప్రస్తావించారు. పాలనలో బిజీగా ఉన్నప్పటికీ కీలక సంస్థల నేపథ్యాన్ని తెలుసుకోవడం కనీస ధర్మమని ఆయన గుర్తుచేశారు.

ఇక్రిశాట్ అనేది ఏ ఒక్క దేశానికీ చెందిన ప్రైవేటు సంస్థ కాదని అది ఒక స్వతంత్ర, లాభాపేక్ష లేని అంతర్జాతీయ పరిశోధనా సంస్థ అని హరీశ్ రావు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రత కోసం పని చేసే ఇటువంటి గ్లోబల్ వేదికలను తప్పుగా చిత్రించడం వల్ల శాస్త్రవేత్తల మనోభావాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నడిచే సంస్థల పట్ల గౌరవం ఉండాలని ఆయన సూచించారు. సరైన సమాచారం లేకుండా విమర్శలు చేయడం వల్ల ప్రభుత్వానికే నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు.

ఈ సంస్థ ఏర్పాటు వెనుక ఉన్న చారిత్రక నేపథ్యాన్ని ముఖ్యమంత్రి విస్మరించడం బాధాకరమని హరీశ్ రావు అన్నారు. ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థతో పాటు ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం, ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థలు దీని ఏర్పాటులో కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. వివిధ దేశాల సమష్టి కృషి వల్ల ఏర్పడిన ఒక మహోన్నత వేదికను తక్కువ చేసి మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. ప్రపంచ



వ్యాప్తంగా ఉన్న మెట్ట భూముల వ్యవసాయంపై ఇక్కడ పరిశోధనలు జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. ప్రారంభ దశలో ఫోర్డ్, రాక్‌ఫెల్లర్ వంటి అంతర్జాతీయ ఫౌండేషన్ల సహకారం ఉన్నప్పటికీ ఇది భారత ప్రభుత్వం సహా అనేక దేశాల మద్దతుతో నడుస్తున్న గ్లోబల్ సెంటర్ అని హరీశ్ రావు వివరించారు. దీన్ని కేవలం 'అమెరికా రీసెర్చ్ సెంటర్' అని పిలవడం రేవంత్ రెడ్డి అవగాహన రాహిత్యానికి పరాకాష్ట అని ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయి వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడే ధోరణిని మార్చుకోవాలని సూచించారు. ఇటువంటి వ్యాఖ్యల వల్ల అంతర్జాతీయ సంస్థలు తెలంగాణ వైపు చూడటానికి వెనకాడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. కేవలం ఇక్రిశాట్ విషయంలోనే కాకుండా అనేక ఇతర కీలక భౌగోళిక, సాంకేతిక అంశాలపై ముఖ్యమంత్రికి సరైన స్పష్టత లేదని హరీశ్ రావు ఆరోపించారు. గతంలో నల్లమల అటవీ ప్రాంత సరిహద్దుల విషయంలో గానీ, కృష్ణాగోదావరి నదీ జలాల పంపకాలపై గానీ సీఎం చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయని గుర్తుచేశారు. సుంకేసుల ప్రాజెక్టు వంటి కీలక సాగునీటి వనరుల పట్ల కూడా రేవంత్ రెడ్డికి అవగాహన లేదని విమర్శించారు. ఈ తరహా ధోరణి వల్ల రాష్ట్ర ప్రయోజనాలకు గండి పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఒక రాష్ట్రానికి నాయకత్వం వహిస్తున్న వ్యక్తికి ప్రాథమిక విషయాలపై అవగాహన ఉండాలని హరీశ్ రావు కోరారు. పాలనలో స్పష్టత లేకపోవడం వల్ల అధికార యంత్రాంగం కూడా అయోమయానికి గురవుతోందని అన్నారు. ముఖ్యమంత్రి చేసే ప్రతి వ్యాఖ్య రాష్ట్ర భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని అది గమనించి ప్రవర్తించాలని కోరారు. వాస్తవాలను తెలుసుకోకుండా తప్పుడు ప్రచారాలు చేయడం వల్ల రాజకీయంగా ప్రయోజనం ఉండవచ్చు కానీ రాష్ట్రానికి మాత్రం తీరని నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వం, ప్రయోజనాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని హరీశ్ రావు స్పష్టం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలతో పాటు రాష్ట్రానికి ఉన్న గొప్ప సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అసత్యాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూడటం మానుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తికి ఉండాల్సిన గంభీరత, పరిణతి రేవంత్ రెడ్డిలో కనిపించడం లేదని విమర్శించారు. ప్రతి అంశాన్ని రాజకీయ కోణంలో చూడటం వల్ల అసలు లక్ష్యం పక్కదారి పడుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో విఫలమవుతున్న ప్రభుత్వం తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఇటువంటి వ్యాఖ్యలు చేస్తోందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన వ్యవస్థలను గౌరవించడం నేర్చుకోవాలని కోరారు. అంతర్జాతీయ స్థాయిలో పేరున్న సంస్థలను వివాదాల్లోకి లాగడం వల్ల కొత్త పెట్టుబడులు రావడానికి ఆటంకాలు ఏర్పడతాయని హెచ్చరించారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా తాము ఇలాంటి పొరపాట్లను ఎత్తిచూపుతూనే ఉంటామని హరీశ్ రావు ప్రకటించారు. ఇప్పటికైనా నోటికి ఏది వస్తే అది మాట్లాడే అలవాటును పక్కన పెట్టాలని ముఖ్యమంత్రికి గట్టిగా సూచించారు. అధికారులతో సమీక్షలు నిర్వహించి వాస్తవాలను పూర్తిగా గ్రహించిన తర్వాతే బహిరంగంగా మాట్లాడాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి ప్రతి మాటను ప్రజలు గమనిస్తుంటారని అది మరిచిపోవద్దని అన్నారు. పొరపాట్లను సరిదిద్దుకుని రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. అనవసర విమర్శలతో కాలక్షేపం చేయడం కంటే ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. రాబోయే రోజుల్లో అయినా రేవంత్ రెడ్డి తన తీరు మార్చుకుంటారని ఆశిస్తున్నట్లు హరీశ్ రావు పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, చేసే వ్యాఖ్యలు రాష్ట్ర ప్రగతికి తోడ్పడేలా ఉండాలే తప్ప వివాదాలకు కేంద్ర బిందువు కాకూడదని ఆకాంక్షించారు. వాస్తవ ఆధారిత రాజకీయాలు చేయాలని, అసత్య ప్రచారాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు.

# యుద్ధం వచ్చినా భారత్ సేఫ్

**మొదటిపేజీ తరువాయి**

యుద్ధం కారణంగా సముద్ర మార్గాల్లో తలెత్తే అవాంతరాలను ఎలా అధిగమించాలన్న అంశంపై ప్రధానంగా చర్చలు సాగాయి. ప్రపంచవ్యాప్తంగా చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి ఇప్పుడు ఇరాన్ గుప్పిట్లో ఉంది. యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఇరాన్ ఈ మార్గం గుండా వెళ్లే నౌకలపై కఠిన ఆంక్షలు విధిస్తోంది. భారత్‌కు వచ్చే ఇంధన నౌకల్లో మెజారిటీ భాగం ఈ జలసంధి నుంచే రావాల్సి ఉండటంతో మన దేశానికి ఇంధన భద్రతపై ఆందోళన మొదలైంది. ఈ ఇబ్బందులను గమనించిన ప్రధాని మోదీ.. దౌత్యపరమైన వ్యూహాలకు పదును పెట్టారు. గల్ఫ్ దేశాలతో పాటు ఇతర మిత్రదేశాల నాయకులతో స్వయంగా మాట్లాడి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా లేదా ఇతర ప్రాంతాల నుంచి ఇంధనాన్ని సేకరించేందుకు వీలుగా చర్చలు జరిపారు. దేశవ్యాప్తంగా ఎక్కడా పెట్రోల్, డీజిల్ లేదా వంటగ్యాస్ కొరత రాకుండా చూడాలని అధికారులను ప్రధాని ఆదేశించారు. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి వెన్నెముకగా నిలిచే ఎరువుల సరఫరాలో జాప్యం జరిగితే ఆహార భద్రతపై ప్రభావం పడుతుందని ఆయన హెచ్చరించారు. వినియోగదారులకు భారం పడకుండా ఉండటంతో పాటు పరిశ్రమలకు అవసరమైన ఇంధన పంపిణీ సజావుగా సాగాలని స్పష్టం చేశారు. అంతర్జాతీయ పరిణామాలను నిశితంగా గమనిస్తూ ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవాలని పెట్రోలియం శాఖకు సూచించారు. యుద్ధం ఎంతకాలం సాగినా భారత్ సిద్ధంగా ఉండాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

గ్యాస్ పంపిణీ వ్యవస్థలో ఒత్తిడిని తగ్గించేందుకు ప్రభుత్వం ఇప్పుడు కొత్త వ్యూహాలను అమలు చేస్తోంది. సిటీ గ్యాస్ ప్రాజెక్టులను వేగవంతం చేయడం ద్వారా ఎల్పీజీ సిలిండర్లపై ఆధారపడటాన్ని తగ్గించాలని భావిస్తోంది. పైప్‌డ్ నేచురల్ గ్యాస్ వాడకాన్ని పెంచడం ద్వారా ఇళ్లలోకి నేరుగా గ్యాస్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థకు కీలక ఆదేశాలు జారీ అయ్యాయి. గ్యాస్ కనెక్షన్ల దరఖాస్తులను కేవలం పది రోజుల వ్యవధిలోనే పరిష్కరించాలని అధికారులు నిర్ణయించారు. దీనివల్ల సాధారణ ప్రజలకు సిలిండర్ల కోసం నిరీక్షించాల్సిన అవసరం తప్పుతుంది. వాణిజ్య అవసరాల కోసం గ్యాస్ వాడుతున్న హోటళ్లు, రెస్టారెంట్లు, డెయిరీ పరిశ్రమలు తక్షణమే పీఎన్‌జీకి మారాలని ప్రభుత్వం సూచించింది. వాణిజ్య వినియోగదారులకు కేటాయింపులను పెంచుతూనే.. గృహ అవసరాల కోసం వాడే ఎల్పీజీ నిల్వలను సురక్షితంగా ఉంచాలని ప్లాన్ చేశారు. మార్చి నెలలో విడతల వారీగా గ్యాస్ కేటాయింపులను పెంచుకుంటూ పోవడంతో ప్రస్తుతం సరఫరా యాభై శాతానికి చేరుకుంది. విద్య విద్యా సంస్థలు, సామాజిక వంటశాలలకు గ్యాస్ సరఫరాలో మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. నిరంతర పర్యవేక్షణ కారణంగా దేశవ్యాప్తంగా వంటగ్యాస్ నిల్వలు నిలకడగా ఉన్నాయని ప్రభుత్వం భరోసా ఇస్తోంది. పశ్చిమాసియా సంక్షోభం వేళ రష్యా నుంచి అందుతున్న సహాయం భారత్‌కు ఊరటనిస్తోంది. తాజాగా రష్యాకు చెందిన భారీ చమురు నౌక ఎంటీ ఆక్వా టైటాన్ మంగళూరు తీరానికి చేరుకుంది. ఎంఆర్‌పీఎల్ సంస్థకు చెందిన ఈ చమురు లోడు త్వరలోనే పోర్టులోకి ప్రవేశించి రిఫైనరీలకు చేరుకోనుంది. గల్ఫ్ దేశాల నుంచి దిగుమతులు తగ్గుతున్న తరుణంలో రష్యా నుంచి వస్తున్న ఈ చమురు మన దేశ అవసరాలను తీర్చడంలో కీలకంగా మారింది. ఇంధన ధరలు పెరగకుండా అదుపు చేయడంలో ఇలాంటి నేరుగా జరిగే దిగుమతులు ఎంతగానో దోహదపడుతున్నాయి. కేవలం రష్యా మాత్రమే కాకుండా అమెరికా నుంచి కూడా భారత్‌కు ఇంధన సరఫరా మొదలైంది. టెక్సాస్ నుంచి బయలుదేరిన పైక్సిస్ పయనీర్ అనే భారీ గ్యాస్ నౌక సుదీర్ఘ ప్రయాణం తర్వాత కర్ణాటక తీరానికి చేరుకుంది. ఇందులో సుమారు పదహారు వేల టన్నుల ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ ఉంది. గల్ఫ్ మార్గాల్లో దిగ్బంధనం ఉన్నా.. అమెరికా, నెదర్లాండ్స్ వంటి దేశాల నుంచి ఇంధనాన్ని తెప్పించుకోవడం ద్వారా భారత్ తన సత్తాను చాటుతోంది. ఇంధన వనరుల కోసం ఒకే ప్రాంతంపై ఆధారపడకుండా విభిన్న దేశాలతో ఒప్పందాలు చేసుకోవడం మన దేశానికి ఇప్పుడు రక్షణ కవచంగా మారింది.


వచ్చే వారం రోజుల్లో న్యూ మంగళూరు పోర్టుకు మరిన్ని నౌకలు వచ్చే అవకాశం ఉంది. దాదాపు డెబ్బై రెండు వేల టన్నుల గ్యాస్ నిల్వలు మన తీరానికి చేరనున్నాయి. ఈ గ్యాస్‌ను పైప్‌లైన్ల ద్వారా బెంగళూరు సహా దక్షిణాదిలోని ఇతర ప్రధాన నగరాలకు తరలిస్తారు. దీనివల్ల దక్షిణ భారత్‌లో వంటగ్యాస్ కొరత అనే మాటే వినిపించదని అధికారులు చెబుతున్నారు. యుద్ధం వల్ల సరఫరా గొలుసు తెగిపోతుందనే భయంతో ప్రజలు ముందస్తు బుకింగ్‌లు చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. కృత్రిమ కొరత సృష్టించే వారిపై నిఘా ఉంచాలని కూడా ఆదేశాలు అందాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్నా.. భారత్ తన వ్యూహాత్మక నిల్వలను వాడుకుంటూ ధరల స్థిరీకరణకు ప్రయత్నిస్తోంది. ప్రజలపై అదనపు భారం పడకుండా చూడటమే లక్ష్యంగా కేంద్ర ఆర్థిక శాఖ కూడా పెట్రోలియం శాఖతో కలిసి పనిచేస్తోంది. యుద్ధ తీవ్రత పెరిగితే తీసుకోవాల్సిన అత్యవసర చర్యలపై ఇప్పటికే బ్లూప్రింట్ సిద్ధమైంది. సముద్ర మార్గాల్లో రక్షణ కల్పించేందుకు భారత నౌకాదళం కూడా సిద్ధంగా ఉంది. వాణిజ్య నౌకలకు ఎటువంటి ముప్పు తలెత్తకుండా గస్తీని పెంచడం ద్వారా ఇంధన ప్రవాహం ఆగిపోకుండా చూస్తున్నారు. యువతరం డిజిటల్ యుగంలో ప్రతి వార్తను నిశితంగా గమనిస్తోంది. ఇంధన ధరల పెరుగుదల వల్ల సామాన్యుడి బడ్జెట్ ఎలా మారుతుందో అందరికీ తెలుసు. అందుకే ప్రభుత్వం పారదర్శకతతో వ్యవహరిస్తూ ఎప్పటికప్పుడు వాస్తవాలను వివరిస్తోంది. గ్యాస్ సబ్సిడీలు, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ వంటి పథకాలు సజావుగా సాగేలా టెక్నాలజీని వాడుతున్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని.. దేశంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ప్రజల్లో ధైర్యాన్ని నింపుతున్నాయి. మౌలిక వసతుల కల్పనలో భారత్ సాధించిన ప్రగతి ఇప్పుడు ఇలాంటి విపత్కర సమయాల్లో మనల్ని ఆదుకుంటోంది.



# ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైనది

**విశాలభారతి, హనుమకొండ:**

ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించుకోకపోతే రానున్న రోజుల్లో మానవ మనుగడకే ముప్పు ఏర్పడుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం అంతర్జాతీయ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం తిరుమలగిరి గ్రామంలో స్థానిక సర్పంచ్ దేవేంద్ర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రి దనసరి అనసూయ సీతక్క, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, కలెక్టర్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ద్వారా పంపిణీ చేస్తున్న శుద్ధ నీరు, ప్రైవేట్ వాటర్ ప్లాంట్ల నుండి వినియోగించే నీరు గురించి అధికారులు డెమో ప్రదర్శించారు. సమావేశం లో మంత్రి సీతక్క మాట్లాడుతూ మానవ మనుగడకు నీరు ప్రాణాధారమని, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాలలో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంగా ప్రపంచ నీటి దినోత్సవాన్ని జరుపుతున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకున్నప్పుడే భావి తరాలకు నీటి ఇబ్బందులు ఏర్పడవని పేర్కొన్నారు. భూగర్భ జలాలు పెరిగేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విచ్చలవిడిగా నీటిని వృధాచేయడం వల్ల నీటిని కొనుక్కునే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. చెట్లను పెంచని పక్షంలో రానున్న రోజుల్లో గాలిని సైతం కొనాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాలకు సమీపంలోని చెరువులను కాపాడుతూనే అడవులను కాపాడుకోవాలని సూచించారు. గ్రామాలలో మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరా జరుగుతున్నదని తెలిపారు. వాటర్ ప్లాంట్ల పై ఆధారపడకుండా గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న నీటిని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి గ్రామంలో ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న శుద్ధమైన నీరు వినియోగంపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. పంటలకు అధిక రసాయనిక ఎరువులను వినియోగిస్తున్నారని, వాటి వినియోగాన్ని తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. రసాయనిక ఎరువులు వినియోగం పెరగడంతో క్యాన్సర్, ఇతర అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయని తెలిపారు.




**మిషన్ భగీరథ నీటిని సద్వినియోగం చేసుకోవాలి..**

గ్రామాలలో మిషన్ భగీరథ నీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు.

# తెలంగాణ కొత్త బిల్డింగ్ రూల్స్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, భవన నిర్మాణ రంగంపై ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా, పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ నిబంధనలలో భారీ మార్పులు ప్రవేశపెట్టింది. ముఖ్యంగా ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ వినియోగానికి సంబంధించి కొత్త మార్గదర్శకాలను విడుదల చేయడం ద్వారా భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియలో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. ఈ నిర్ణయం ప్రధానంగా హైదరాబాద్ వంటి మహానగరాల్లో ఆకాశహర్మ్యాల నిర్మాణానికి ఒక స్పష్టమైన దిశానిర్దేశం చేయడమే కాకుండా, పట్టణీకరణలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి దోహదపడుతుందని నిపుణులు భావిస్తున్నారు. ప్రభుత్వం తాజాగా వెలువరించిన ఉత్తర్వుల ప్రకారం హైరైజ్ భవనాల నిర్వచనంలో సమూల మార్పులు చోటుచేసుకున్నాయి. గతంలో ఉన్న నిబంధనలను సవరిస్తూ ఇకపై 21 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉండే భవనాలన్నింటినీ హైరైజ్ కేటగిరీ కింద పరిగణించనున్నారు. నిర్మాణ రంగంలో పారదర్శకతను పెంచడంతో పాటు, నగర విస్తరణను ఒక క్రమపద్ధతిలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసినట్లు స్పష్టమవుతోంది. ఈ కొత్త నిబంధన వల్ల బిల్డర్లు, సామాన్య గృహ యజమానులు తమ ప్లాట్లలో చేపట్టే నిర్మాణాల విషయంలో మరింత స్పష్టతతో ముందుకు వెళ్లే అవకాశం కలిగింది. నిర్మాణ విస్తీర్ణాన్ని బట్టి అదనపు అంతస్తుల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముఖ్యంగా 2000 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్లాట్లలో అదనపు అంతస్తుల నిర్మాణానికి ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. అయితే ఈ అనుమతులు ఆయా ప్రాంతాల్లో ఉన్న రోడ్డు వెడల్పుపై ఆధారపడి ఉంటాయి. 40 అడుగుల రోడ్డు ఉన్న ప్రాంతాల్లో మూడు అదనపు అంతస్తులు, 60 అడుగుల రోడ్డు ఉంటే నాలుగు అంతస్తులు, అలాగే 80 అడుగుల వెడల్పు ఉన్న రోడ్ల పక్కన ఏకంగా ఐదు అదనపు అంతస్తుల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇది నగరంలో నివాస ప్రాంతాల సాంద్రతను పెంచడానికి తోడ్పడుతుంది.



హైరైజ్ భవనాల నిర్మాణంలో టీడీఆర్ వినియోగాన్ని ప్రభుత్వం మరింత పటిష్టం చేసింది. పది అంతస్తులు దాటి నిర్మించే ప్రతి భవనానికి టీడీఆర్ వాడకాన్ని తప్పనిసరి చేస్తూ నిబంధన విధించింది. దీనివల్ల ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన వారికి ఇచ్చే టీడీఆర్ సర్టిఫికెట్లకు మార్కెట్లో డిమాండ్ పెరుగుతుంది. అలాగే 20 అంతస్తులు దాటిన భారీ భవనాలకు 5 శాతం మేర టీడీఆర్ లోడింగ్ కల్పించడం ద్వారా రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిచ్చింది. ఈ విధానం వల్ల భూమి విలువ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో గరిష్టంగా నిర్మాణ విస్తీర్ణాన్ని వినియోగించుకునే అవకాశం బిల్డర్లకు దక్కుతుంది.

మధ్యతరహా ప్లాట్లలో ఇళ్ల నిర్మాణం చేపట్టేవారికి కూడా ప్రభుత్వం కొన్ని నిబంధనలను స్పష్టం చేసింది. 750 నుంచి 2000 చదరపు మీటర్ల మధ్య విస్తీర్ణం ఉన్న ప్లాట్లలో 18 నుంచి 21 మీటర్ల ఎత్తు వరకు నిర్మించే భవనాలకు కూడా టీడీఆర్ వాడకాన్ని విధిగా అమలు చేయాలని ఆదేశించింది. తద్వారా చిన్న, మధ్య తరహా నిర్మాణాలలో కూడా క్రమబద్ధీకరణ వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. నాన్ హైరైజ్ భవనాలకు సంబంధించి సెట్‌బ్యాక్ నిబంధనలలో సడలింపులు ఇవ్వడం ద్వారా ఇరుకైన ప్లాట్లలో కూడా మెరుగైన నిర్మాణాలు చేపట్టేందుకు వీలు కలుగుతుంది. హైరైజ్ భవనాల విషయంలో భద్రత, గాలి, వెలుతురు ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని సెట్‌బ్యాక్ రిలాక్సేషన్ కల్పించారు. నిర్ణీత నిబంధనల ప్రకారం నిర్మించే ఎత్తైన భవనాల్లో 10 శాతం వరకు సెట్‌బ్యాక్ సడలింపులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీనివల్ల భవనం చుట్టూ ఉండాల్సిన ఖాళీ స్థలం విషయంలో కొంత వెసులుబాటు లభిస్తుంది. అయితే ఈ సడలింపులు పొందాలంటే తప్పనిసరిగా టీడీఆర్ వినియోగించాల్సి ఉంటుంది. ఈ విధానం ద్వారా నగర అందాన్ని కాపాడుతూనే, అందుబాటులో ఉన్న స్థలాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడానికి మార్గం సుగమమైంది.

భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియలో ఆర్థికపరమైన క్రమశిక్షణను పెంచేందుకు ప్రభుత్వం టీడీఆర్ సమర్పణ గడువులను ఖరారు చేసింది. భవన నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసుకునే సమయంలోనే మొత్తం అవసరమైన టీడీఆర్‌లో 50 శాతాన్ని ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. ఇది ప్రాజెక్టు ప్రారంభంలోనే చట్టబద్ధతను నిర్ధారిస్తుంది. మిగిలిన 50 శాతం టీడీఆర్‌ను భవన నిర్మాణం పూర్తయిన తర్వాత, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసే లోపు చెల్లించాలని నిబంధన విధించింది. ఈ రెండు దశల ప్రక్రియ వల్ల బిల్డర్లపై ఒకేసారి ఆర్థిక భారం పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాలు నిర్మాణ రంగంపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టీడీఆర్ వినియోగాన్ని తప్పనిసరి చేయడం ద్వారా భూ సేకరణ ప్రక్రియలో ప్రభుత్వం చెల్లించాల్సిన పరిహారం భారం తగ్గుతుంది. మరోవైపు టీడీఆర్ బాండ్లు కలిగి ఉన్న సామాన్యులకు అవి నగదుగా మారే అవకాశాలు మెరుగుపడతాయి. నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి ఈ కొత్త నిబంధనలు ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను అందిస్తాయి. దీనివల్ల ప్రాజెక్టుల నిర్వహణ, ప్లానింగ్ విషయంలో జాప్యం తగ్గే అవకాశం ఉంది.

నగర జీవన ప్రమాణాలను మెరుగుపరిచే క్రమంలో రోడ్ల వెడల్పుకు అనుగుణంగా అంతస్తుల సంఖ్యను పెంచడం ఒక విప్లవాత్మక అడుగు. ఇరుకైన రోడ్లపై భారీ భవనాలు నిర్మించడం వల్ల కలిగే ట్రాఫిక్ ఇబ్బందులను ఇది నివారిస్తుంది. విశాలమైన రోడ్లు ఉన్న చోట ఎత్తైన భవనాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా నగర మౌలిక సదుపాయాలపై ఒత్తిడి తగ్గుతుంది. ప్రభుత్వం ఈ నిబంధనలను పక్కాగా అమలు చేస్తే హైదరాబాద్ నగరం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన మెట్రోపాలిటన్ నగరంగా మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.


ఈ మార్పులు కేవలం బిల్డర్లకు మాత్రమే కాకుండా, సామాన్య గృహ కొనుగోలుదారులకు కూడా ప్రయోజనకరంగా మారనున్నాయి. పారదర్శకమైన నిబంధనల వల్ల నిర్మాణ వ్యయంపై కొంత నియంత్రణ వచ్చే అవకాశం ఉంది. అలాగే సెట్‌బ్యాక్ సడలింపుల మరియు అదనపు అంతస్తుల వల్ల తక్కువ స్థలంలో ఎక్కువ మందికి నివాస వసతి కల్పించే వీలుంటుంది. ఇది గృహాల ధరలను స్థిరీకరించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టత ఇవ్వడం ద్వారా అనుమతుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ కూడా తప్పుతుందని ఆశిస్తున్నారు.

మొత్తానికి తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఈ నూతన భవన నిర్మాణ నిబంధనలు రాష్ట్ర ప్రగతికి కొత్త ఊపిరి పోయనున్నాయి. హైరైజ్ భవనాల విషయంలో తీసుకున్న నిర్ణయం వల్ల ఆకాశహర్మ్యాల నిర్మాణానికి మరిన్ని అవకాశాలు లభిస్తాయి. టీడీఆర్ వినియోగంలో తీసుకొచ్చిన సంస్కరణలు స్థిరాస్తి రంగంలో జవాబుదారీతనాన్ని పెంచుతాయి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ నిబంధనలు కేవలం నివాసాలకే పరిమితం కాకుండా, వాణిజ్య సముదాయాల నిర్మాణానికి కూడా గొప్ప ప్రోత్సాహాన్ని అందిస్తాయి. అభివృద్ధి, నిబంధనల మధ్య సమతుల్యతను కాపాడటంలో ఈ నిర్ణయం మైలురాయిగా నిలవనుంది.

# అన్నదాతకు 'రేవంత్' భరోసా

**మొదటిపేజీ తరువాయి**

ఎకరాలకు చేరుకుందని, ఇది భవిష్యత్తులో 10 లక్షల ఎకరాలకు పెరిగినా సరే, ఆ పంట మొత్తాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరగడం వల్ల రంగారెడ్డి వంటి జిల్లాల్లో సాగు భూమి తగ్గిపోవడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల పాలు, కూరగాయల వంటి కనీస అవసరాల కోసం కూడా ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనిని అధిగమించేలా రైతులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. కేవలం వరి పంటపైనే ఆధారపడకుండా రైతులు ఇతర లాభసాటి పంటల వైపు ఆలోచించాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. విదేశాలకు వరిని ఎగుమతి చేయాలన్నా సరైన గిట్టుబాటు ధరలు లభించడం లేదని, అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా 50 లక్షల టన్నుల కంటే ఎక్కువ వరిని కొనలేమని తేల్చి చెప్పిందని ఆయన గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో పంటల మార్పిడి అనేది అనివార్యమని, రైతులు, నిపుణులు కలిసి ఒక పటిష్టమైన ప్రణాళికను సిద్ధం చేయాలని కోరారు.



ఆ ప్రణాళికలతో అవసరమైతే ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి చర్చించడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని, సిద్ధిపేటలో నిర్మించిన రిఫైనరీ తరహాలోనే తన నియోజకవర్గమైన కొడంగల్‌లో కూడా ఒక ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల ద్వారా ఆదాయాన్ని ఎలా పెంచుకోవాలో వివరిస్తూ సీఎం రేవంత్ రెడ్డి 'అంకాపూర్ చికెన్' ఉదాహరణను ప్రస్తావించారు. నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్ గ్రామం చికెన్ వంటకాలతో దేశవ్యాప్తంగా ఎలా పాపులర్ అయిందో గుర్తుచేస్తూ, రైతులు కూడా ప్రత్యామ్నాయ వ్యాపార మార్గాలను అన్వేషించాలని సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని, శిక్షణను ప్రభుత్వం ఉచితంగా అందుబాటులోకి తెస్తుందని ఆయన వాగ్దానం చేశారు. పండించిన ప్రతి గింజను మార్కెట్ చేయడంలో, ఎగుమతి చేయడంలో ప్రభుత్వం అండగా ఉంటుందని, తెలంగాణలో పండే ప్రతి పంటా 'బంగారు తెలంగాణ' నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని ఆయన ఆకాంక్షించారు. రైతులతో పాటు మహిళా సాధికారత కోసం తమ ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలను రేవంత్ రెడ్డి ఈ వేదికపై వివరించారు. స్వయం సహాయక బృందాలకు ఆర్థిక ప్రోత్సాహం అందించడమే కాకుండా, మహిళలకు పెట్రోల్ బంకులు కేటాయించడం, ఆర్టీసీ బస్సులకు వారిని ఓనర్లను చేయడం వంటి చర్యలు చేపట్టామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను కూడా మహిళల పేరుతోనే కేటాయిస్తున్నామని, అలాగే ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలకు ప్రయాణ భారతం తగ్గించామని చెప్పారు. సమాజంలో మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, దానికి తమ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. విద్యారంగంలో తీసుకువస్తున్న మార్పుల గురించి ప్రస్తావిస్తూ, సర్కారీ బడులను ప్రైవేటు పాఠశాలల కంటే మెరుగ్గా తీర్చిదిద్దుతున్నట్లు సీఎం తెలిపారు. అందుకే పాఠశాల విద్యాశాఖను తన దగ్గరే ఉంచుకున్నానని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే తన ప్రాధాన్యత అని చెప్పారు. కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా చెప్పుల తయారీ, ఫ్యాషన్ టెక్నాలజీ, బ్యూటీ బొటిక్ వంటి నైపుణ్య ఆధారిత వృత్తుల్లో శిక్షణ పొందితే స్వయం ఉపాధి ద్వారా నెలకు వేల రూపాయలు సంపాదించవచ్చని సూచించారు. నేటి తరం యువత సాంకేతిక విద్యతో పాటు కనీసం మూడు భాషల్లో పట్టు సాధిస్తే, ఉద్యోగ అవకాశాలు వారి వెతుక్కుంటూ వస్తాయని ఆయన హితబోధ చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని రేవంత్ రెడ్డి కోరారు. ఎరువులు, యూరియా కొరతను అధిగమించడానికి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, ఇతర బీజేపీ ఎంపీలతో కలిసి ప్రధాని మోదీని కలవాలని మంత్రి తుమ్మలకు సూచించారు.

# ఇండ్లు కూల్చి విగ్రహాలు నిర్మిస్తే సహించం

**మొదటిపేజీ తరువాయి**

ఉన్నాయని, అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లను కూల్చి విగ్రహాలు లేదా ప్రాజెక్టులు నిర్మించడాన్ని తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన 'మూసీ నది పునరుజ్జీవనంవాస్తవాలు' అనే చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను, హైదరాబాద్‌ను సుదీర్ఘ కాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ అప్పట్లో మూసీ ప్రక్షాళన గురించి ఎందుకు పట్టించుకోలేదని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. ఇప్పుడు అకస్మాత్తుగా అభివృద్ధి మంత్రాన్ని పఠిస్తూ భారీ ప్రాజెక్టులను తెరపైకి తీసుకురావడం వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటని ఆయన ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. మూసీ నదిని శుభ్రం చేయడం, సుందరీకరణ చేయడం లేదా పర్యాటక రంగంగా అభివృద్ధి చేయడం వంటి అంశాలకు బీజేపీ ఏనాడూ వ్యతిరేకం కాదని ఆయన పునరుద్ఘాటించారు. నది స్వచ్ఛంగా ఉండాలని, ప్రవహించే నీరు ఆరోగ్యకరంగా ఉండాలని తాము కూడా కోరుకుంటున్నట్లు తెలిపారు. అయితే అభివృద్ధి అనే ముసుగు వేసుకుని ప్రజాధనాన్ని దోచుకోవాలని చూస్తే మాత్రం సహించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. గత ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట భారీ స్థాయిలో అవినీతి జరిగిందని విమర్శించిన ఆయన, ఇప్పుడు మూసీ ప్రాజెక్టు పేరుతో అదే తరహా అక్రమాలు పునరావృతం కాబోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాధనం అనేది ప్రజల ఆస్తి అని, దానిని ఇష్టానుసారంగా వృథా చేసే హక్కు ఏ ప్రభుత్వానికి లేదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. మూసీ నది ప్రక్షాళన అనేది కేవలం ఒక ఇంజనీరింగ్ ప్రాజెక్టు మాత్రమే కాదని, అది తెలంగాణ భవిష్యత్తుకు సంబంధించిన ఒక కీలక పెట్టుబడి అని రాంచందర్ రావు అభివర్ణించారు. ప్రజల ఆరోగ్యానికి, రైతుల జీవన ప్రమాణాలకు మూసీ శుద్ధి అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. మూసీ నది అంటే కేవలం హైదరాబాద్ నగరానికే పరిమితమైనది కాదని, దీని భౌగోళిక విస్తృతి చాలా పెద్దదని వివరించారు. వికారాబాద్ జిల్లాలో జన్మించి నల్గొండ, సూర్యాపేట జిల్లాల గుండా ప్రవహించి చివరికి కృష్ణా నదిలో కలిసే ఈ నది దాదాపు 240 కిలోమీటర్ల మేర విస్తరించి ఉందని గుర్తు చేశారు. ఈ నదీ పరీవాహక ప్రాంతంలో వేలాది మంది రైతులు పంటలు పండిస్తున్నారని, పెరుగుతున్న కాలుష్యం కారణంగా ఆ పంటలు విషతుల్యంగా మారుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

నదుల ప్రాముఖ్యత గురించి మాట్లాడుతూ మనం తాగే ప్రతి నీటి బొట్టులో ఒక నది కథ ఉంటుందని ఆయన భావోద్వేగంగా చెప్పారు. సమాజానికి జీవాన్ని ఇచ్చే నదులను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్వాతంత్ర్యానికి పూర్వమే నదుల అనుసంధానం గురించి ఎంతో దూరదృష్టితో ఆలోచించారని రాంచందర్ రావు కొనియాడారు. వైస్రాయ్ కౌన్సిల్‌లో సభ్యుడిగా ఉన్న కాలంలోనే ఆయన చేసిన సూచనల వల్ల సెంట్రల్ వాటర్ కమిషన్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు ఆవిర్భవించాయని తెలిపారు. భారతదేశ నీటి నిర్వహణ వ్యవస్థలో అంబేద్కర్ పాత్ర చిరస్మరణీయమని, ఆయన ఆలోచనల ఆధారంగానే నేటికీ అనేక నీటి పారుదల ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయని వివరించారు.




రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాట్లాడుతూ పెన్షన్లు ఇవ్వడానికి, రైతు భరోసా వంటి పథకాలను అమలు చేయడానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం, మూసీ ప్రాజెక్టు కోసం లక్షల కోట్ల రూపాయలను ఎక్కడి నుంచి తెస్తుందని నిలదీశారు. ఈ భారీ అప్పుల భారం చివరకు తెలంగాణ సామాన్య ప్రజల నెత్తినే పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అటల్ బిహారీ వాజపేయి స్ఫూర్తితో గుజరాత్‌లో నర్మదా, సబర్మతి నదులను అనుసంధానం చేసి అద్భుతాలు సృష్టించారని గుర్తు చేశారు. అక్కడ కూడా ప్రాజెక్టుల కోసం నిర్మాణాలను తొలగించాల్సి వచ్చిందని, అయితే కేంద్ర ప్రభుత్వం అక్కడ బాధితులకు ముందుగానే మెరుగైన పునరావాసం కల్పించిందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో వేల కిలోమీటర్ల పొడవున్న గంగా నదిని శుద్ధి చేయడానికి కేవలం రూ. 20,000 కోట్లు ఖర్చయితే, కేవలం మూసీ కోసం లక్షల కోట్లు ఎందుకని ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వం అవలంబిస్తున్న "ముందు కూల్చి, తర్వాత చూద్దాం" అనే విధానం అత్యంత దుర్మార్గమైనదని ఆయన మండిపడ్డారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు వ్యయాన్ని మొదట రూ. 5,000 కోట్లుగా చెప్పి, ఆ వెంటనే రూ. 7,000 కోట్లకు పెంచడం వెనుక భారీ కుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఇళ్ల కూల్చివేత విషయంలోనూ ప్రభుత్వం అయోమయానికి గురిచేస్తోందని విమర్శించారు. ఒకవైపు పదివేల ఇళ్లు కూల్చుతామని చెబుతూనే, అసెంబ్లీలో మాత్రం ఒక మంత్రి కేవలం 1,400 ఇళ్లేనని మాట మార్చడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన లండన్ థేమ్స్ నది, పారిస్‌లోని సీన్ నది లేదా అమెరికాలోని చికాగో సరస్సులను ఎంతో అందంగా తీర్చిదిద్దారని, కానీ అక్కడ ఎక్కడా బఫర్ జోన్ పేరుతో ప్రజలను ఊళ్ల నుంచి వెళ్లగొట్టలేదని గుర్తు చేశారు. బఫర్ జోన్ నిబంధనల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్షను ఆయన ఎండగట్టారు. 12 మీటర్ల నుంచి 50 మీటర్ల వరకు బఫర్ జోన్ పెంచాలని చూడటం గందరగోళానికి దారితీస్తోందన్నారు. ఒకే నదికి ఒకే రకమైన నిబంధనలు ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. నార్సింగి వంటి ప్రాంతాల్లో భారీ వ్యాపార నిర్మాణాలకు వర్తించని బఫర్ జోన్ రూల్స్, మధు పార్కు రిడ్జ్ వంటి చోట్ల సామాన్య ప్రజల ఇళ్లకు ఎందుకు వర్తిస్తాయని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు ముసుగులో రియల్ ఎస్టేట్ మాఫియాకు కొమ్ముకాస్తూ వేలాది ఎకరాల భూమిని స్వాధీనం చేసుకునే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. రైతుల జీవనాధారమైన భూములను లాక్కుంటే వారు రోడ్డున పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల పరిస్థితి గురించి చర్చిస్తూ మూసీ పరీవాహక ప్రాంతంలో దాదాపు 3,000 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించాలని చూడటం వారి జీవనోపాధిపై చావుదెబ్బ కొట్టడమేనని అన్నారు.

# నా కుటుంబాన్ని రక్షించండి

**మొదటిపేజీ తరువాయి**

మాత్రమే కాకుండా తన కుటుంబ సభ్యులను సైతం లక్ష్యంగా చేసుకుని దుండగులు హెచ్చరికలు జారీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో తన భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి ఈ లేఖను పంపారు. ముఖ్యంగా ఇటీవలి కాలంలో తన నివాసానికి, కార్యాలయానికి అనేక బెదిరింపు లేఖలు వచ్చాయని రాజాసింగ్ గుర్తుచేశారు. తన వ్యక్తిగత మొబైల్ నంబర్‌కు అంతర్జాతీయ కాల్స్ ద్వారా బెదిరింపులు వస్తున్నాయని, వీటిపై స్థానిక పోలీసులకు ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే పోలీసులు ఈ ఫిర్యాదులపై నామమాత్రపు చర్యలు కూడా తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల తన కుటుంబం తీవ్రమైన ప్రమాదంలో చిక్కుకుందని, రక్షణ కల్పించాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉందని ఆయన స్పష్టం చేశారు.



ఈ బెదిరింపుల వెనుక ఉన్న మూలాలను వెలికితీయాలని, ఇందుకోసం సమగ్ర దర్యాప్తు జరిపించాలని కేంద్ర హోం మంత్రిని కోరారు. తనను టార్గెట్ చేస్తున్న వ్యక్తులు లేదా సమూహాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భద్రతకు సంబంధించి తాను చేస్తున్న విన్నపాలను గతంలో కూడా కేంద్ర మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లానని, అయితే అక్కడ నుంచి కేవలం ఫిర్యాదు అందినట్లు రసీదు మాత్రమే వచ్చిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. తదుపరి చర్యలు తీసుకోకపోవడం వల్ల దుండగుల ఆగడాలు మరింత పెరిగాయని ఆయన లేఖలో వివరించారు. భద్రత కోరుతూ తాను రాస్తున్న చివరి లేఖ ఇదేనని రాజాసింగ్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ఇకపై తాను భద్రత కోసం ఎవరినీ బతిమలాడబోనని, చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా రక్షణ కల్పించాలని కోరినప్పటికీ ఫలితం లేకపోవడంతో తన సహనం నశించిందని పేర్కొన్నారు. తన కుటుంబ భద్రతకు ఏవైనా విఘాతం కలిగితే దానికి ప్రస్తుత ప్రభుత్వ యంత్రాంగమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇన్నాళ్లూ ఓపికతో ఉన్నానని, కానీ ప్రస్తుత పరిస్థితులు తనను ఆందోళనకు గురిచేస్తున్నాయని ఆయన వాపోయారు. తన మొబైల్ నంబర్‌కు వచ్చిన కాల్స్ వివరాలు, కార్యాలయానికి అందిన లేఖల ప్రతులను కూడా అధికారులకు సమర్పించినట్లు రాజాసింగ్ తెలిపారు. ఇన్ని ఆధారాలు ఉన్నప్పటికీ నిందితులను పట్టుకోవడంలో అలసత్వం ప్రదర్శించడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ప్రజాప్రతినిధికే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. తన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి కేంద్ర బలగాల ద్వారా భద్రతను పర్యవేక్షించాలని ఆయన అమిత్ షాను కోరారు.

లేఖలోని ఒక దశలో రాజాసింగ్ అత్యంత కఠినమైన వ్యాఖ్యలు చేశారు. తన కుటుంబానికి గానీ, తన సభ్యులలో ఎవరికైనా ఏదైనా హాని జరిగితే తాను మళ్లీ పోలీసుల వద్దకు వెళ్లే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అటువంటి విపత్కర పరిస్థితుల్లో తనను తాను రక్షించుకోవడానికి, తన కుటుంబ గౌరవాన్ని కాపాడుకోవడానికి స్వయంగా ఆయుధం పట్టుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తన వారిని కాపాడుకునే క్రమంలో బాధ్యులను హతమార్చడానికి కూడా వెనకాడనని ఆయన అత్యంత తీవ్రమైన పదజాలంతో లేఖలో పేర్కొనడం సంచలనంగా మారింది. వరుసగా వస్తున్న బెదిరింపుల వల్ల తన రోజువారీ కార్యక్రమాలకు కూడా ఆటంకం కలుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ ప్రజల మధ్యకు వెళ్లాలన్నా, బహిరంగ సభల్లో పాల్గొనాలన్నా భద్రత లేని కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. తన భద్రతను పటిష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కూడా అనేకసార్లు విన్నవించినా సానుకూల స్పందన రాలేదని ఆవేదన చెందారు. అందుకే నేరుగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకోవాలని కోరుతున్నట్లు ఆయన లేఖలో స్పష్టంగా రాశారు. కేవలం తన రాజకీయ సిద్ధాంతాల వల్లే తనను కొంతమంది శత్రువులుగా చూస్తున్నారని, ప్రజాస్వామ్యంలో భిన్న అభిప్రాయాలు ఉండటం సహజమని రాజాసింగ్ అభిప్రాయపడ్డారు. కానీ అభిప్రాయ భేదాలను ప్రాణాలు తీసే స్థాయికి తీసుకెళ్లడం సరికాదని అన్నారు. తనకు రక్షణ కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు, రేపు ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే సమాధానం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. తన లేఖను తీవ్రంగా పరిగణించి వెంటనే స్పందించాలని అమిత్ షాను వేడుకున్నారు. దుండగులు సాగిస్తున్న ఈ బెదిరింపుల పర్వం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. పొరుగు దేశాల నుంచి వస్తున్న కాల్స్ డేటాను పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని సూచించారు. దేశ వ్యతిరేక శక్తులు తనను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నాయని, దీనిపై నిఘా సంస్థలతో విచారణ జరిపించాలని కోరారు. తన ప్రాణాలకు ఏ క్షణమైనా ముప్పు పొంచి ఉందనే భావనలో ఉన్నట్లు ఆయన లేఖలోని సారాంశం ద్వారా స్పష్టమవుతోంది. రాజాసింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఒక ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి తన రక్షణ కోసం ఆయుధం పడతానని అనడం ప్రస్తుత భద్రతా లోపాలను ఎత్తిచూపుతోందని ఆయన మద్దతుదారులు వాదిస్తున్నారు. తన సహనాన్ని పరీక్షించవద్దని, చట్టం తన పని తాను చేయకపోతే పౌరులే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే స్పందన కోసం తాను ఎదురుచూస్తున్నట్లు రాజాసింగ్ పేర్కొన్నారు.

# శత్రువులకు నో ఎంట్రీ

**మొదటిపేజీ తరువాయి**

యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ, ఇరాన్ తన పంతాన్ని కొంత పక్కన పెట్టి దౌత్యపరమైన ముందడుగు వేయడం గమనార్హం. ఈ వివాదానికి కేంద్ర బిందువైన హర్మూజ్ జలసంధి ద్వారానే ప్రపంచవ్యాప్త చమురు రవాణాలో ఐదో వంతు జరుగుతుంటుంది. ఇరాన్ ఈ మార్గాన్ని అదుపులోకి తీసుకోవడం వల్ల గ్లోబల్ ఎనర్జీ మార్కెట్ అతలాకుతలమవుతోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. కేవలం 48 గంటల సమయం మాత్రమే ఇస్తున్నామని, ఈలోగా జలసంధిని పూర్తిగా తెరవకుంటే ఇరాన్‌లోని కీలక విద్యుత్ కేంద్రాలే లక్ష్యంగా బాంబుల వర్షం కురిపిస్తామని హెచ్చరించారు. అగ్రరాజ్యం సైనిక చర్యకు దిగితే అది మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందన్న ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ ఎట్టకేలకు స్పందించింది. యుద్ధం కంటే శాంతికే తాము ప్రాధాన్యం ఇస్తామని ఆ దేశం సంకేతాలిచ్చింది. శత్రు దేశాలకు చెందిన నౌకలు మినహా, మిగిలిన అన్ని వ్యాపార నౌకలు తమతో సమన్వయం చేసుకుంటూ హర్మూజ్ జలసంధి ద్వారా ప్రయాణించవచ్చని ఇరాన్ స్పష్టం చేసింది. ఐక్యరాజ్యసమితి పరిధిలోని అంతర్జాతీయ సముద్రయాన సంస్థలో ఇరాన్ సీనియర్ ప్రతినిధి అలీ మౌసావి ఈ కీలక ప్రకటన చేశారు. అమెరికా విధించిన గడువు ముగియడానికి ముందే ఇరాన్ నుంచి ఈ తరహా స్పందన రావడం అంతర్జాతీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అయితే, ఈ సందర్భంగా ఇరాన్ తన గళాన్ని బలంగానే వినిపించింది. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ప్రస్తుత అశాంతికి, ఉద్రిక్తతలకు అమెరికా, ఇజ్రాయెల్ దేశాలే ప్రధాన సూత్రధారులని మౌసావి ఘాటుగా విమర్శించారు. దౌత్య మార్గాల్లో సమస్యలను పరిష్కరించుకోవడానికి తాము ఎప్పుడూ సిద్ధమేనని, కానీ ఇరాన్ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. దురాక్రమణ చర్యలను నిలిపివేసి, పరస్పర విశ్వాసాన్ని పెంపొందించుకున్నప్పుడే శాంతి సాధ్యమవుతుందని ఆయన అంతర్జాతీయ సమాజానికి వివరించారు. మరోవైపు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన హెచ్చరికలను మరింత తీవ్రతరం చేశారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా, ఇరాన్‌లోని అతిపెద్ద విద్యుత్ కేంద్రాన్ని తమ మొదటి లక్ష్యంగా ఎంచుకున్నట్లు ప్రకటించారు. ఇరాన్ ప్రజలను అంధకారంలోకి నెట్టడం ద్వారా ఆ దేశ పాలకులపై ఒత్తిడి తీసుకురావాలన్నది ట్రంప్ వ్యూహంగా కనిపిస్తోంది. విద్యుత్ వ్యవస్థ కుప్పకూలితే పరిశ్రమలు, రవాణా మరియు కమ్యూనికేషన్ వ్యవస్థలు స్తంభించిపోతాయి. ఈ రకమైన ఆధునిక యుద్ధ తంత్రం ద్వారా ఇరాన్‌ను లొంగదీసుకోవాలని అమెరికా భావిస్తోంది.



ఇరాన్ ప్రతినిధి మౌసావి మాట్లాడుతూ.. నావికుల భద్రత, సముద్ర మార్గాల్లో రక్షణను మెరుగుపరచడానికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఇందుకోసం ఐఎంవోకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. సముద్ర చట్టాలను గౌరవిస్తూనే తమ దేశ భద్రతను కాపాడుకుంటామని ఆయన స్పష్టం చేశారు. కేవలం తమను ఇబ్బంది పెట్టాలని చూసే దేశాల నౌకలను మాత్రమే అడ్డుకుంటామని, మిగిలిన ప్రపంచానికి తమ వల్ల ఎలాంటి ముప్పు ఉండదని ఆయన భరోసా ఇచ్చారు. ఇది ఒకరకంగా అగ్రరాజ్యానికి ఇరాన్ ఇస్తున్న రాయితీగా భావించవచ్చు.

నేటి తరం యువత ఈ పరిణామాలను చాలా నిశితంగా గమనిస్తోంది. సోషల్ మీడియా వేదికగా ట్రంప్ చేసే వ్యాఖ్యలు, ఇరాన్ ఇచ్చే కౌంటర్లు నిరంతరం వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా చమురు ధరలు పెరిగితే ఆ ప్రభావం సామాన్యుడి జేబుపై ఎలా పడుతుందనేది ఆందోళన కలిగిస్తోంది. ఒక చిన్న జలసంధి మూసివేత వల్ల ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని తాకడం మనం చూస్తూనే ఉన్నాం. అందుకే యుద్ధం కంటే దౌత్యమే మేలని మెజారిటీ నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అగ్రరాజ్యం తన సైనిక బలాన్ని ప్రదర్శిస్తుంటే, ఇరాన్ తన భౌగోళిక వ్యూహంతో సవాల్ విసురుతోంది. ఇజ్రాయెల్ పాత్ర కూడా ఈ వివాదంలో కీలకంగా మారింది. ఇరాన్ తన అణు కార్యకలాపాలను పెంచుతోందని, హర్మూజ్ జలసంధిని ఆయుధంగా వాడుకుంటోందని ఇజ్రాయెల్ మొదటి నుంచీ వాదిస్తోంది. అమెరికా చర్యలకు ఇజ్రాయెల్ పూర్తి మద్దతు ప్రకటించింది. అటు ఇరాన్ మాత్రం తన ప్రాంతీయ ప్రయోజనాల కోసం దేనికైనా సిద్ధమని చెబుతోంది. ఈ రెండు దేశాల మధ్య దశాబ్దాలుగా ఉన్న వైరం ఇప్పుడు సముద్ర మార్గంలో పెను తుపానును సృష్టిస్తోంది. ఈ గొడవలో చిక్కుకున్న వాణిజ్య నౌకలు ఇప్పుడు ప్రాణాలరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ కేంద్రాలపై దాడి చేస్తామన్న ట్రంప్ హెచ్చరికలు ఇరాన్ అంతర్గత వ్యవస్థలో కలకలం రేపాయి. ఒకవేళ అమెరికా తన మాట మీద నిలబడి దాడికి దిగితే, దానికి ప్రతిగా ఇరాన్ తనవద్ద ఉన్న క్షిపణులను ప్రయోగించే అవకాశం ఉంది. ఇది కేవలం రెండు దేశాల మధ్య గొడవగా మిగిలిపోకుండా, పశ్చిమ ఆసియా అంతటా వ్యాపించే ప్రమాదం ఉంది. అందుకే సౌదీ అరేబియా, యూఏఈ వంటి దేశాలు కూడా ఈ పరిస్థితిని ఆందోళనతో గమనిస్తున్నాయి. శాంతియుత వాతావరణం ఉంటేనే వ్యాపారాలు సజావుగా సాగుతాయని అవి భావిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఇరాన్ నుంచి వచ్చిన ఈ స్పందన కొంత ఊరటనిచ్చే విషయమే. "శత్రు దేశాల నౌకలు మినహా మిగిలిన వారికి అనుమతి" అనే మాట ద్వారా ఇరాన్ తన ఆధిపత్యాన్ని చాటుకుంటూనే, ప్రపంచ దేశాల ఆగ్రహానికి గురికాకుండా జాగ్రత్త పడింది. అమెరికా కూడా ఇరాన్ మాటలను ఎంతవరకు నమ్ముతుందనేది చూడాలి. 48 గంటల గడువులో ఇంకా సమయం మిగిలి ఉండటంతో, అగ్రరాజ్యం తన తదుపరి అడుగును ఎలా వేస్తుందో అని ప్రపంచమంతా ఉత్కంఠగా ఎదురుచూస్తోంది. దౌత్యం గెలుస్తుందా లేక యుద్ధం మొదలవుతుందా అనేది కాలమే నిర్ణయించాలి.

## జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా కడారి రమేష్



**విశాల భారతి, అడ్డగూడూరు:** యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా అడ్డగూడూరు పట్టణ కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కడారి రమేష్ నియమితులయ్యారు. అట్టి నియామక పత్రాన్ని ఆదివారం భువనగిరి వివేరా హోటల్ లో నిర్వహించిన సమావేశంలో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మరియు జిల్లా అధ్యక్షులు బీర్ల ఐలయ్య గార్ల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన శాసనసభ్యులు సామేలు సామేలు మరియు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గార్లకు కడారి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో నిస్వార్థంగా పనిచేస్తున్నాననీ... కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అహర్నిశలు పనిచేసి మళ్ళీ రాబోయే ఏ ఎన్నికల్లోనైనా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కొరకు కృషి చేస్తానని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ సీనియర్ నేత రాపాక ముత్తయ్య మృతి



**దేవరుప్పుల, విశాలభారతి :**మండలం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాపాక ముత్తయ్య మరణం పార్టీకి తీరని లోటుగా నిలిచింది. ముత్తయ్య ఈరోజు ముత్తయ్య మరణించగా వారి స్వగృహంలో భౌతిక కాయానికి పూలదండ వేసి ఘన నివాళులు అర్పించారు. కాంగ్రెస్ శ్రేణులు జెండాను కప్పి చివరి గౌరవం తెలుపుతూ, కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండ ఊర్మిల మల్లారెడ్డి, ఉపసర్పంచ్ జోగు అనిల్, వార్డ్ మెంబర్స్ కార్యకర్తలు రాపాక శ్రీశైలం, అటికం ఎల్ల య్య, నల్ల యాదగిరి, కొమ్ము నాగయ్య, అటికం నరసయ్య, తాళ్లపల్లి ఐలయ్య, కొండ చిన్న బుచ్చిరెడ్డి, కొమ్ము సత్తయ్య, జోగు రాములు, ఊట్ల యాదగిరి, మరియు గ్రామ ప్రజలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

**కౌన్సిలర్ షాబుద్దీన్ .. నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీమ్**



**కోదాడ, విశాలభారతి:** యువజన కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీమ్ అన్నారు. ఆదివారం మాతా నగర్ 27వ వార్డు యూత్ ప్రెసిడెంట్‌గా షేక్ సైదాను నియమించారు. కౌన్సిలర్ షాబుద్దీన్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో అజీమ్ మాట్లాడుతూ యువత రాజకీయాల్లో చురుగ్గా పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వార్డు స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి, కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను గడప,గడపకు తీసుకు వెళ్లేందుకు యూత్ కాంగ్రెస్ నాయకులు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కొత్తగా ఎన్నికైన సైదాకు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమాల్,హారిఫ్,కాశీం, మున్నా, బాబ్బు,రహీం, సాయి, శ్రీను,జలాల్, ఉమార్, హనీఫ్,ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవరసిద్ధి వినాయక కమిటీ ప్రధాన కార్యదర్శిగా హాజీ నాయక్



**కోదాడ, విశాలాభారతి:** కోదాడ 19వ వార్డు భవానీ నగర్ లోని శ్రీ వరసిద్ధి వినాయక దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శిగా హాజీ నాయక్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జరిగిన ఎన్నికలో వార్డ్ కౌన్సిలర్ కోటిరెడ్డి, పెద్దల సమక్షంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా హాజీ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గా పనిచేసి పదవీ విరమణ చేసిన ఆయన, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కోదాడ శాఖ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కొనసాగుతున్నారు.

## ఇంపాక్ట్ మోటివేషనల్ స్పీకర్‌గా బోనాల సైదారావు




**కోదాడ, విశాలభారతి:** సూర్యాపేట జిల్లాలోని కోదాడ పట్టణానికి చెందిన బోనాల సైదారావు మోటివేషనల్ స్పీకర్ గా ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శిక్షణ పొందారు. శని & ఆదివారాల్లో నల్గొండ లోని ఒక ప్రైవేటు హోటల్లో జరిగిన కార్యక్రమంలో నేషనల్ హెడ్ బోర్డ్ మెంబర్ నూనె సుదర్శన్ చేతుల మీదుగా మోటివేషనల్ స్పీకర్ గా సర్టిఫికెట్ పొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో రీజియన్ 2 ప్రెసిడెంట్ కోట్ల సాయికిరణ్, కోటా సరిత నారాయణ కవిత, గూడూరు అంజిరెడ్డి, హర్షిత, శ్రీలత, రవీంద్ర చారి, బాలు, సరిత మొదలగు ట్రైనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోనాల సైదారావు మాట్లాడుతూ విద్యార్థులు, యువతకి ప్రేరణ కలిగించి వారి లక్ష్యాలు సాధించే విధంగా జ్ఞాన నైపుణ్యాలు అందించడం, సమాజ సేవతో దేశాభివృద్ధిలో పాల్గొనడం తన కర్తవ్యం అని తెలియజేశారు.ఈ సందర్భంగా శిక్షణ పొందిన 30 ట్రైనర్లు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు గంపా నాగేశ్వరరావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడికి సన్మానం



**ఆర్మూర్, విశాలభారతి:** ఇటివల కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా నిమామితులైన గదారి గోపి ని వెల్మల్ అంబెద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నాడు శాలువతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువకులు శుభాకర్, సంతోష్, దయాకర్, ప్రశాంత్, దీక్షిత్, చింకు, సన్నీ, అఖిలేష్, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు అన్యాయం చేసిన బడ్జెట్‌పై నిరసనకు పిలుపు

- **బొంగు వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఆందోళన**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ బీసీలకు వ్యతిరేకంగా ఉందని ఎల్‌బి నగర్ ఇంచార్జి బొంగు వెంకటేష్‌గౌడ్ విమర్శించారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు బీసీలకు కేటాయింపుల్లో అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ రేపు సోమవారం ఉదయం 10 గంటలకు ఎల్‌బి నగర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రూ. 3,24,234 కోట్లతో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు మరియు అగ్రకుల పేదలు కలిపి సుమారు 93 శాతం ఉన్నప్పటికీ, అందులో బీసీలు 56 శాతం ఉన్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ వారి ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. ముఖ్యంగా విద్య, వైద్యం, స్వయం ఉపాధి రంగాల్లో సరైన నిధులు కేటాయించకపోవడం ద్వారా బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బొంగు వెంకటేష్‌గౌడ్ కోరారు.

# రబీలో ఆదర్శ రైతు డ్రోన్ వినియోగం

- **సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయంలో పెను మార్పులు గాదే నర్సిరెడ్డి**
- **నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అవలంబించాలి ఎ .డి.ఎ తాతారావు**
- **కృషి విజ్ఞాన కేంద్రం సాంకేతిక పరిజ్ఞానం వైపు రైతులు అడుగులు.భరత్**




**బూర్గంపాడు, విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సోంపల్లిలో ఆదివారం కృషి విజ్ఞాన కేంద్రం గ్రామీణ అనుభవ కృషి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదర్శ రైతు గాదె నర్సిరెడ్డి నూతన సాంకేతిక పరిజ్ఞానం వైపు దృష్టి సారించినట్టు తెలిపారు . కృషి విజ్ఞాన కేంద్రం ప్రోత్సాహం, వ్యవసాయ శాఖ సహకారంతో రబీ పంట సాగులో గత కలెక్టర్ జితిస్ వి పాటిల్ ఆధ్వర్యంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా డ్రోన్ వినియోగించి విత్తనాలు వెదజల్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాగా బూర్గంపాడు మండలంలో మొదటిసారి డ్రోన్ వినియోగం రైతులను ఆశ్చర్యానికి గురిచేసింది. అప్పటి కలెక్టర్ జితిస్ వి పాటిల్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు అదనపు ఆదాయం కలిగిన పంటలను సాగు చేయాలని సూచించారు. ఉదాహరణకు పామాయిల్, మునగా సాగు, కొర్రమీను , బాతులు, రైతు నేస్తాలుగా పిలవబడే పంటల వైపు దృష్టిసారించాలని అన్నారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డైరెక్టర్ టి భరత్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయంలో పెనుమార్పులు వచ్చినట్టు వ్యాఖ్యానించారు. డ్రోన్ వినియోగంతో విత్తనాలు వెదజల్లడమే కాకుండా గుళికలు, మందులు పిచికారి మొదలగు కార్యక్రమాలు చేయవచ్చని సూచించారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారి ఏడిఏ తాతారావు మాట్లాడుతూ వ్యవసాయాంత్రీకరణ పెరగాలి,నాణ్యమైన ఉత్పత్తుల పెరగాలనీ సూచించి రాష్ట్ర ప్రభుత్వం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 10 డ్రోన్లను మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతు మాట్లాడుతూ కలెక్టర్ సూచన మేరకు కృషి విజ్ఞాన కేంద్రం,వ్యవసాయ శాఖ సలహాలు సూచనలతో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో మరియు అదనపు ఆదాయం కలిగిన పంటలను సాగుచేస్తూ అధిక దిగుబడులు,లాభాలు గడిస్తున్నట్టు తెలిపారు.

## ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో అన్ని వర్గాలకు అన్యాయం

- **రేవంత్ ప్రభుత్వం నాడు టాప్ గేరు-నేడు రివర్స్ గేరు**
- **గిర్కటి నిరంజన్ గౌడ్ బిఆర్ఎస్ మండల అధ్యక్షులు**




**చౌటుప్పల్, విశాలభారతి:**

మండల కేంద్రంలోని ఆదివారం నాడు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం తీరు నాడు టాప్ గేరు నేడు రివర్స్ గేరుల వ్యవహరిస్తుందని,మొన్న అసెంబ్లీ సమావేశలలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో బీసీ ఎస్సీ ఎస్టీ రైతులు మరియు మహిళలకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు.బీసీలకు ప్రతి ఏడాది 20 లక్షల కోట్ల చొప్పున ఐదేళ్లు ఖర్చు చేస్తామని చెప్పి దారుణంగా వెన్నుపోటు పొడిచారని,మూడో ఏడాది కలిసి 60 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా అందులో సగం కూడా కేటాయించలేదని వారిని విమర్శించారు.ఎస్సీ ఎస్టీల సంక్షేమానికి ఏకంగా 70% వరకు నిధులు తగ్గించి ఉసురు తీశారు. దళిత బంద్ స్థానంలో 12 లక్షలు ఇస్తామన్న మాట దేవుదేరుగు ఉన్న సంక్షేమాన్ని సమాధి చేశారు. ఈసారి బడ్జెట్లో కొత్త ఉద్యోగాలు భర్తీ చేస్తామని లేదు,కొత్త ఉద్యోగాలు కేటాయింపు,లేదు బిఆర్ఎస్ ప్రభుత్వం భర్తీ చేసిన 60 వేల ఉద్యోగాలను తమ ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటు అని అన్నారు.మూడుసార్లు రైతుబంధు కొట్టిన కాంగ్రెస్ మూడో ఏడాది కూడా బడ్జెట్లో మోసం చేసింది.నాడు పదేళ్లలో 2,80 లక్షల కోట్లు అప్పు చేస్తే,నేడు రెండున్నర ఏళ్లలో 3,75 లక్షల కోట్ల అప్పు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇటుక పేర్చకుండా,ఒక్క ప్రాజెక్టు కట్టకుండా బడ్జెట్ చూపించడం సిగ్గుచేటు అని దుయ్యబట్టారు.మొత్తానికి ఆడబిడ్డల నుండి అంగన్వాడీ కార్యకర్తల వరకు రైతుల నుండి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వరకు విద్యార్థుల నుండి నిరుద్యోగుల వరకు అందరిని మోసం చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం, అందులోనూ బిఆర్ఎస్ ఎమ్మెల్యే నియోజకవర్గాల పై కక్షగట్టారని తెలిపారు.బడ్జెట్ ప్రసంగంలో జర్నలిస్టుల ఊసే లేదు,ప్రతి ఒక్కరిని అరచేతిలో వైకుంఠం చూపించి దారుణంగా దగా చేసిందని ఈ సందర్భంగా వారు అన్నారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు ఢిల్లీ మాధవరెడ్డి,రైతుబంధు సమితి మాజీ జిల్లా డైరెక్టర్ ముప్పిడి శ్రీనివాస్‌గౌడ్,మండల కమిటీ సభ్యులు బాతురాజు యాదగిరి,చెన్నగోని వెంకటేశ, బాతురాజు లింగస్వామి,బిఆర్ఎస్వీ సభ్యులు ఉదరి. రాకేష్,గంగాదేవి.శివ,ఎండి.అతు,సిగ.మహేష్ గౌడ్,సోమ.శ్రీధర్ రెడ్డి,ఈడుదుల.రాంప్రసాద్,గంజి. విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## తాటి రామచంద్రం జ్ఞాపకార్థం చలివేంద్రం ప్రారంబోత్సవం



**ప్రారంభించిన మొగదాల పావని రమేష్ గౌడ్ మున్సిపల్ చైర్మన్**

**చౌటుప్పల్, విశాలభారతి:**

మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో స్వర్గీయ తాటి రామచంద్రం జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. రాజీవ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, తాటి రామచంద్రం సేవా సమితి నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ చేతుల మీదగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కీర్తిశేషులు తాటి రామచంద్రం కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఆయన స్మారకార్థంగా సేవా సమితి చైర్మన్ తాటి వెంకటేశం ప్రతీ సంవత్సరం వేసవికాలంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దాహాన్ని తీర్చడం అభినందనీయమని తెలిపారు .ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, కౌన్సిలర్లు పిల్లలమర్రి మధుసూదన్, పాక చిరంజీవి, మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పాశం సంజయ్ బాబు, శ్రీ సీతా రామచంద్రస్వామి దేవస్థానం అధ్యక్షుడు బొబ్బిళ్ళ మురళి, సేవా సమితి చైర్మన్ తాటి వెంకటేశం, ప్రధాన కార్యదర్శి చెరుకు లింగస్వామి, కాంగ్రెస్ నాయకులు గోశిక రవి, గుర్రం వెంకటేశం, గోశిక ప్రభాకర్, బొబ్బిళ్ళ రాజేందర్, రఫీ, బొంగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీని నెరవేరుస్తున్న సర్పంచ్ రాధిక శ్రీశైలం

**మహాలక్ష్మి కానుకగా నగదు అందజేత**

**చౌటుప్పల్, విశాలభారతి:**

మండల పరిధిలోని తుప్రాన్‌పేట గ్రామ సర్పంచ్ బక్కతట్ల రాధిక-శ్రీశైలం యాదవ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చారు. గ్రామపంచాయతీ మేనిఫెస్టోలో పేద, మధ్యతరగతి కుటుంబాల్లో జన్మించే ఆడబిడ్డలకు 'మహాలక్ష్మి కానుక' అందజేస్తానని ప్రకటించి తాజాగా ఆ మాట నిలబెట్టుకున్నారు.గ్రామానికి చెందిన వర్కూరి మౌనిక-బాలకృష్ణ దంపతులకు ఇటీవల ఆడబిడ్డ జన్మించిన విషయం తెలుసుకున్న సర్పంచ్, ఆదివారం వారి ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం ఆ చిన్నారికి మహాలక్ష్మి కానుక గా రూ.10,116 నగదు అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ ముద్దం రమేష్ యాదవ్, వార్డు సభ్యులు బొజ్జ స్వామి, బక్కతట్ల శ్రీకాంత్ యాదవ్, మంటిపల్లి మల్లయ్య యాదవ్, వర్కూరి బాలకృష్ణ, పోచమోని అండాలు, గంధం భాగ్యమ్మ అశోక్, భారాస గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి చంచల భరత్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు బక్కతట్ల యాదగిరి యాదవ్, వర్కూరి రాము, వంటల ప్రవీణ్, చిలుకల మల్లేష్, గుండెమోని నాగరాజు యాదవ్, పోచమోని పవన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు సేవలు మరువలేనివి

- **దశదిన కార్యక్రమంలో నివాళులు అర్పించిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు సేవలు మరువలేనివని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రోజు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని వేష్ణవి గార్డెన్‌లో నిర్వహించిన దశదిన కార్యక్రమంలో పాల్గొని రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ..కొండిగారి రాములు రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. ఆయన చేసిన సేవలు ఇబ్రహీంపట్నం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. నిజమైన కమ్యూనిస్టు వాదిగా ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలిచి, నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేశారని కొనియాడారు. రానున్న రోజుల్లో రాములు కుటుంబానికి అండగా ఉంటానని మంచిరెడ్డి కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని రాములుకి ఘనంగా నివాళులు అర్పించారు.

## ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి కుటుంబంలో విషాదం

- **మనవడు మృతికి సిపిఐ నాయకుల శ్రద్ధాంజలి**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సిపిఐ సీనియర్ నాయకుడు అమరజీవి కామ్రేడ్ ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి కుమారుడు (ఏవీఎన్ రెడ్డి, రిటైర్డ్ ఈఈ) వెంకన్న కుమారుడు గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతూ, శనివారం రోజు (21032026) సాయంత్రం కేర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మృతిచెందిన యువకుడి మరణ వార్తతో కుటుంబ సభ్యులు, బంధువులు, పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. విషయం తెలుసుకున్న సిపిఐ పార్టీ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. మృతదేహానికి పూలమాలలు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరుట్ల కుటుంబం తెలంగాణ ఉద్యమ చరిత్రలో విశిష్ట స్థానం కలిగి ఉందని, అలాంటి కుటుంబంలో జరిగిన ఈ అపూర్వ లోటు తీరనిదని పేర్కొన్నారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

## అహింస హిత మహా కరుణ శాకాహార ర్యాలీ



**ఆర్మూర్,విశాలభారతి:** నిజామాబాద్ జిల్లాబాల్కొండ నియోజకవర్గం వన్నెల్ (బి )గ్రామంలో గ్రామ పిరమిడ్ మాస్టర్ల ఆధ్వర్యంలో అహింసాహిత మహా కరుణ శాఖాహార ర్యాలీ ఆనంద ఆదివారం ధ్యాన జ్ఞాన కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించడం జరిగిందని పి ఎస్ ఎస్ ఎం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి తెలిపారు. గ్రామంలోని ప్రధాన వీధుల లో శాకాహార ర్యాలీ నిర్వహించి మానవుల ఆహారం శాకాహారమని, ముక్తికి మార్గం శాకాహారమని, శక్తికి మార్గం శాకాహారమని జీవహింస మహా పాపమని ఏ జీవిని చంపే హక్కు ఎవరికీ లేదని మానవులందరూ ధ్యానం చేస్తూ శాఖాహారం భుజించాలని నినాదాలు చేస్తూ అద్భుతంగా శాఖాహార ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జ్ఞాన దాతలుగా హిమాలయ యోగి కట్టా కళాధర్ రెడ్డి గారు, ధ్యాన రుషి మిట్ట మనోహర్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఎంత ఉత్సాహంగా శాకాహార ర్యాలీలు నిర్వహించడం, ధ్యాన ప్రచారాలు చేయడం ఎంతో అద్భుతమని ఈ సందర్భంగా తెలిపారు. గ్రామ గ్రామానికి గడపగడపకు ఇంటింటికి అద్భుతంగా ధ్యాన ప్రచారం చేస్తూ ఎంతో సేవలందిస్తున్నారని కొనియాడారు. ఈ ధ్యాన జ్ఞాన కార్యక్రమంలో 800 మందికి పైగా ధ్యానులు పాల్గొన్నారు. వచ్చిన వారందరికీ నిర్వాహకులు అన్నప్రసాదాన్ని అందించారు. ఈ ధ్యాన జ్ఞాన కార్యక్రమంలో పి ఎస్ ఎస్ ఎం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి, జిల్లా బాధ్యులు బొడ్డు దయానంద్ , మామిడి లక్ష్మారెడ్డి , అమరవాజి శ్రీనివాస్, ల్యాబ్ రవీందర్, రాజ గంగారాం, నిశాంత్, నాగంపేట శ్రీనివాస్, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

## చరిత్ర సృష్టించిన పీఎం

**మొదటిపేజీ తరువాయి**

మంత్రులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రశంసల వర్షం కురిపించారు. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తన సోషల్ మీడియా ఖాతాలో ఇలా రాశారు.. 'దేశం పట్ల, ప్రజల పట్ల ఉన్న అపారమైన భక్తికి మోదీ నిదర్శనం. ఆయన జీవితం నిరంతర సేవా ప్రయాణం. దేశ ప్రయోజనాలే పరమావధిగా ఆయన సాగిస్తున్న పాలన ప్రతి పౌరుడికి స్ఫూర్తిదాయకం' అన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా సోషల్ మీడియా ఖాతాల్లో మోదీకి శుభాకాంక్షలు చెప్పారు. 'గడిచిన 24 ఏళ్లలో ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా దేశం కోసం శ్రమించడం మోదీకి మాత్రమే సాధ్యమైంది. పేదలకు హక్కులు కల్పించడం, అభివృద్ధిలో కొత్త రికార్డులు సృష్టించడం ద్వారా ఆయన 'మోదీ యుగాన్ని' సృష్టించారు. ప్రజలకు ఆయనపై ఉన్న నమ్మకం రోజురోజుకూ పెరుగుతూనే ఉందన్నారు. జేపీ నడ్డా (ఆరోగ్య మంత్రి).. 'మోదీ నాయకత్వంలో భారత్ ఇప్పుడు 'వికసిత భారత్' దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. మహిళలు, రైతులు, యువత, పేదల సంక్షేమమే లక్ష్యంగా ఆయన పాలన సాగుతోంది. ప్రపంచ వేదికపై నేడు భారత్ ఎంతో శక్తివంతంగా నిలిచింది'. అశ్విని వైష్ణవ్ (రైల్వే మంత్రి).. జమ్మూ కాశ్మీర్‌లోని ప్రపంచంలోనే ఎత్తైన చెనాబ్ రైల్వే వంతెనపై జాతీయ జెండా పట్టుకున్న ప్రధాని ఫోటోను షేర్ చేస్తూ.. 'ఆయన ప్రతి క్షణం దేశ ప్రజల కోసమే'అని కొనియాడారు. పియూష్‌గోయల్ , కిరణ్ రిజిజు.. మోదీ ప్రయాణం కష్టపడే తత్వానికి, నిజాయితీకి నిదర్శనమని, ఇది దేశాభివృద్ధిని మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు.


## ప్రాపర్టీ టాక్స్ పరిష్కారం వేదిక కార్యక్రమం నిర్వహణ




**రాజేంద్రనగర్, విశాలభారతి :** జీహెచ్ఎంసీ పరిధిలోని అత్తాపూర్ సర్కిల్20, రాజేంద్రనగర్ జోన్‌లో ప్రాపర్టీ టాక్స్ పరిష్కారం వేదిక కార్యక్రమం ఆదివారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి వచ్చిన ప్రాపర్టీ టాక్స్‌కు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించారు. డిప్యూటీ కమిషనర్ అందిన ఫిర్యాదులను పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీలు, ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలకు సౌకర్యవంతంగా సేవలు అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు

## ఉద్యోగం రాకపోవడంతో యువకుడి ఆత్మహత్య

**రంగారెడ్డి జిల్లాలో విషాదం**



**రాజేంద్రనగర్, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. శివరాం పల్లి వికర్ సెక్షన్ కాలనీలో ఉద్యోగం రాకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు సిద్ధార్థ్‌గా గుర్తించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని అతను ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మృతుడి తమ్ముడు తెలిపిన వివరాల ప్రకారం, సిద్ధార్థ్ ఎవరితోనూ గొడవలు పెట్టుకునే వ్యక్తి కాదని, ఎప్పుడూ ఉద్యోగం గురించే ఆలోచిస్తూ ఉండేవాడని తెలిపారు. ఉద్యోగం రాకపోవడం వల్లే తీవ్ర మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా కొన్ని రోజుల్లోనే సిద్ధార్థ్ వివాహం కూడా నిశ్చయమైందని, ఇంతలోనే ఈ దుర్ఘటన జరగడం కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా, అత్తాపూర్ పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్ కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి

**నల్లు సుధాకర్ రెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్**



**సిరోల్ విశాలభారతి:** రైతులు ఆధునిక పద్ధతులను ఉపయోగించుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలిని ఆత్మ కమిటీ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి కోరారు. సీరోల్ మండలం మొన్నెగూడెం గ్రామ రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి చాయరాజ్ అధ్యక్షతన జరిగిన రైతులు శాస్త్రవేత్తతో ముఖాముఖి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి, యూరియా తక్కువ మోతాదులు వాడడం, పచ్చ రొట్టే వేసుకోవడం, రైతులందరూ ఒకే పంట కాకుండా వేరువేరు రకాలు సాగు చేయడం లాంటి పద్ధతులను శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలతో సాగును సాంప్రదాయ పద్ధతిలో కాకుండా ఆధునిక పద్ధతులతో లాభదాయకంగా మార్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారీని బి సరిత, జిల్లా హార్టీ కల్చర్ అధికారి మరియన్న, డివిజన్ వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, మల్యాల శాస్త్రవేత్త క్రాంతి కుమార్, సర్పంచ్ కొండపల్లి లక్ష్మి కరుణాకర్ రెడ్డి, ప్రతాపని బిక్షమయ్య, కామ సంజీవరావు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ నిర్మాణానికి రూ.50,000 విరాళం

**అందజేసిన జక్కిడి చారిటబుల్ ట్రస్ట్**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్ నగర్ ప్రాంతంలోని లెక్చరర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయ నిర్మాణానికి జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జక్కిడి రఘువీర్ రెడ్డి రూ.50,000 విరాళాన్ని అందజేసింది. ఇప్పటికే ఇచ్చిన మాట ప్రకారం ట్రస్ట్ తరపున ఈ విరాళాన్ని అందించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఆధ్యాత్మిక సేవను పరమోన్నత ధర్మంగా భావిస్తూ, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను కొనసాగించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. భగవంతుడి కృపతో ప్రతి కుటుంబం ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, నాగార్జున రెడ్డి, మహేష్ రెడ్డి, రాజు, కేశవ్, ఉమా మహేశ్వర్ రావు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**




**భద్రాద్రి ప్రతినిధి: విశాలభారతి:** భద్రాద్రిజిల్లా కలెక్టరేట్ లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## మీకోసం మేమున్నాం టీమ్ ఆధ్వర్యంలో వాల్ ఆఫ్ కైండ్ నైస్

**చర్ల: విశాలాబరతి:** మీకోసం మేమున్నాం టీమ్ ఆధ్వర్యంలో వాల్ ఆఫ్ కైండ్ నైస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం చర్ల లోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద సుమారు 200 మందికి, పలువురు దాతల నుంచి సేకరించిన దుస్తులు, చీరలు ,చిన్న పిల్లల బట్టలు ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ.కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొన్ని రోజుల నుండి ఆగినా ఈ కార్యక్రమం కు అధిక ఆదరణ లభించడం ,సంతకు వచ్చిన పేదవారి ఆవస్యకత తెలియజేస్తూందని,కావున వీలున్నంత మంది ప్రజలు ,తమతమ ఇండ్లలో ఉపయోగించని దుస్తులు ,వస్తువులను మీకోసం మేమున్నాం టీం కార్యాలయం వద్దకు చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో దొడ్డి సూరిబాబు,తోట శ్రీధర్, కర్ణాటి మధు, దొడ్డి రమణారావు, దొడ్డ ప్రభుదాస్, రాసకొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# భగత్ సింగ్ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని చందనగర్‌లోని పీజీఆర్ స్టేడియంలో ఆదివారం ఆర్గనైజర్ స్టీఫెన్ వారి బృందం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథులుగా కల్వకుంట్ల కన్నారావు, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్, నియోజకవర్గ బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. రక్తదానం ప్రాణాలను కాపాడే గొప్ప సేవ అని, ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని అతిథులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జెరిపెట్టి రామరాజు, కాంగ్రెస్ నాయకులు మోహన్ ముదిరాజ్, మారబోయిన అనిల్ యాదవ్, టిఆర్ఎస్ నాయకులు నరేందర్ యాదవ్, మారబోయిని రవి యాదవ్, బొబ్బ నవతారెడ్డి, మై హోప్ ఫౌండేషన్ అధినేత కొండా విజయ్, బాక్సింగ్ కోచ్ గిరిబాబు, సుప్రజ హోటల్ యజమాని తుడి ప్రవీణ్, సీనియర్ పాత్రికేయులు పుట్టా వినయ్, కబీర్ కౌశల్, సుహాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





## ఉత్తమ తెలుగు జర్నలిస్టులకు ‘ఉగాది పురస్కారాలు – 2026’

- **40 విభాగాలకు దరఖాస్తుల ఆహ్వానం**
- **మహిళలకు ప్రత్యేకంగా 5 అవార్డులు**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**



ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తూ అక్షరాయుధాలతో సమాజాన్ని చైతన్యపరుస్తున్న జర్నలిస్టులను గౌరవించడం మనందరి బాధ్యత అని తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మేడవరపు రంగనాయకులు పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ‘ఉగాది పురస్కారాలు - 2026’కు సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాల జర్నలిస్టుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృత్తిపరంగా జర్నలిస్టులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 2023లో ఈ పురస్కారాల ప్రక్రియను ప్రారంభించామని తెలిపారు. గత మూడేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, విజయవాడ నగరాల్లో ఘనంగా ఈ కార్యక్రమాలను నిర్వహించామని, ఈ ఏడాది కూడా అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు. గతంలో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ వంటి ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులు అందజేసినట్లు గుర్తు చేశారు. ఈ ఏడాది మొత్తం 40 విభాగాల్లో 50 మంది ఉత్తమ జర్నలిస్టులకు పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. అందులో మహిళా జర్నలిస్టులకు ప్రత్యేకంగా 5 అవార్డులు కేటాయించామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు రాజకీయంగా వేర్వేరుగా ఉన్నప్పటికీ జర్నలిస్టుల మధ్య ఐక్యత కొనసాగుతోందని, మేమంతా తెలుగు జర్నలిస్టులం అనే గర్వంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, ఐక్యత కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని, ఇటువంటి కార్యక్రమాలను ప్రతి ఏడాది కొనసాగిస్తామని పేర్కొన్నారు. వృత్తి పట్ల నిబద్ధత, అంకితభావం కలిగిన జర్నలిస్టులకు ఈ అవార్డులు మరింత ప్రేరణనిస్తాయని రంగనాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యులు మాలెంపాటి శ్రీనివాస్, బోడపాటి సుబ్బారావు, హనుమంతాచారి, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు గజ్జల శ్రీనివాస్, మేనం శ్యామ్, గద్దం సత్యనారాయణ కన్వీనర్‌లుగా వ్యవహరించనున్నారు . దరఖాస్తులకు చివరి తేదీ 05 ఏప్రిల్ 2026గా నిర్ణయించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## స్థానిక సమస్యలపై ఉద్యమించాలి



**సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు**

**పాల్వంచ, విశాలభారతి:**

స్థానిక సమస్యలపై ఉద్యమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సిపిఎం పార్టీ పట్టణ కమిటీ సమావేశం మంచి కంటి నగర్ లో కే సత్య అధ్యక్షతన జరిగింది.ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికలు జరిగి రెండో నెల గడుస్తున్నప్పటికీ కార్పొరేషన్ పరిధిలో సమస్యల పరిష్కారం జరగలేదని గత సంవత్సరం అధికారులు ప్రజాప్రతినిధులు రోడ్లు డ్రైనేజీల కోసం శంకుస్థాపనలు చేశారని, నేటికి కూడా పనులు ప్రారంభించలేదని అన్నారు.సన్మానాల పేరుతో కాలయాపన చేయకుండా స్థానిక సమస్యల పరిష్కారంలో కార్పొరేషన్ అధికారులు గెలిచిన ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టాలని లేదంటే గుర్తించిన సమస్యలపై ప్రజలని సమీకరించి కార్పొరేషన్ పాల్వంచ కార్యాలయం ముట్టడికి సిపిఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు.అర్హులైన పేదలకు ఇంటి స్థలం ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని పెన్షన్లు రానివారికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం వాగ్దానం చేసిన ఆరు గ్యారెంటీలను అమలు జరిగే విధంగా పోరాటాలకి రూపకల్పన చేయాలని,పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు .కేంద్ర బిజెపి ప్రభుత్వం పేదలపై భారాలు వేయడం సరికాదన్నారు పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచడం వల్ల సామాన్యులు ఇబ్బందులకు గురవుతున్నారని పెన్షన్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కి లొంగిపోయి దేశ ప్రతిష్టను దిగదారుస్తున్నాడని రాబోయే రోజుల్లో అమెరికా ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం వల్ల అన్ని రకాల నిత్యవసరాలు ధరలు పెరిగి ప్రజలకు ఇబ్బందులు గురయ్యే పరిస్థితి వచ్చిందనిఅన్నారు . ఇరాన్ పై జరుగుతున్న యుద్ధాన్ని వ్యతిరేకించాలని శాంతి నెలకు నేల అమెరికాపై భారత ప్రభుత్వం ఒత్తిడి తేవాలని అన్నారు ఈ కార్యక్రమం లో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ రవి పార్టీ పట్టణ కార్యదర్శి పి తులసీరామ్ కార్యదర్శివర్గ సభ్యులు కే సత్య వి సత్యవాణి పట్టణ కమిటీ సభ్యులు వి రాములు గౌసియా హమాలీ రాములు , బి మాధవి తదితరులు పాల్గొన్నారు.

## భద్రకాళి బండ్, మ్యూజికల్ గార్డెన్ పనుల్లో వేగం పెంచాలి

**హనుమకొండ, విశాలభారతి:**

భద్రకాళి బండ్ మ్యూజికల్ గార్డెన్ పనుల్లో వేగం పెంచాలని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అన్నారు. ఆదివారం కుడా సిపీవో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు సంబందిత అధికారులతో కలిసి భద్రకాళి బండ్ బయోడైవర్సిటీ పార్క్, కాకతీయ మ్యూజికల్ గార్డెన్ లలో జరుగుతున్న పనులను ఇనగాల వెంకట్రామ్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ నగరాన్ని పర్యాటక రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం భద్రకాళి బండ్ హంటర్ రోడ్ వైపు చేపడుతున్న రెండో దశ అభివృద్ధి పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రకాళి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మాడ వీధుల పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. భద్రకాళి చెరువులో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, మధ్యలో నవగ్రహ దీవులను సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. పర్యాటకులను ఆకర్షించేందుకు తెలంగాణలోనే తొలిసారిగా భద్రకాళి సరస్సుపై సుమారు రూ. 60 కోట్ల అంచనా వ్యయంతో కేబుల్ కార్, గ్లాస్ బ్రిడ్జ్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. దీనివల్ల వరంగల్ పర్యాటక రంగం అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటుందని పేర్కొన్నారు. వాకింగ్ ట్రాక్, ల్యాండ్‌స్కేపింగ్, విద్యుత్ దీపాల ఏర్పాటుతో పాటు పర్యాటకుల కోసం ఫుడ్ స్టాల్స్, బోటింగ్ సౌకర్యాలను మరింత మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. భద్రకాళి సరస్సు చుట్టూ జరుగుతున్న మాడ వీధుల నిర్మాణం, ఘాట్ల అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రకాళి ఆలయ ఆధ్యాత్మికత దెబ్బతినకుండా పనులు జరగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దశాబ్దాలుగా నిరాదరణకు గురైన కాకతీయ మ్యూజికల్ గార్డెన్ కు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు సుమారు రూ. 3.5 కోట్ల వ్యయంతో ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అన్నారు.



## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రేవంతన్న

**మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పీరినాకి నవీన్**



**మణుగూరు, విశాలభారతి :** మణుగూరు మండలంలోని గుట్టమల్లారం రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం రైతు నేస్తం కార్యక్రమం మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చే జరగనున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం మరియు రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమం సందర్భంగా మణుగూరు రైతు వేదిక వద్ద వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విక్షించిన సర్పంచ్ & ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, రైతు సంఘ నాయకులు, రైతులు అందరు సంతోషంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు పీరినాకి నవీన్,కూచిపూడి బాబు మాజీ శివాలయం చైర్మెన్,మణుగూరు మండల గ్రామపంచాయతీల సర్పంచులు గుట్టమల్లారం సర్పంచ్ కారం పూజిత, తిర్లాపురం పాయం చిట్టెమ్మ, విప్పాలసింగారం పాల్వంచ రాములు, కట్టుమల్లారం జగిడి ప్రసాద్, వైస్ సర్పంచులు కొమరం మధు కిరణ్ , గాండ్ల సురేష్, గోరట్ల కనకయ్య, వార్డ్ సభ్యులు ఊకే కృష్ణవేణి,మహిళా అధ్యక్షురాలు సౌజన్య, జిల్లా మహిళా సభ్యులు వరలక్ష్మి గారు, ఆవుల సర్వేషరావు సీనియర్ నాయకులు, జి వి,పాలమూరి రాజు, ఎనిక బాలకృష్ణ,బత్తుల శ్రీను,కొంగ్రెస్ కరకర్తలు, రైతు సోదర సోదిరిమనులు ఈరెల్లి కోటయ్య, అంచుమల్ల నరసింహారావు, ఆముదల శ్యామల, సుజాత ఊకే వీరయ్య మణుగూరు మండల వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచలో ఉగాది వేడుకలు

**పాల్గొన్న టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు**



**పాల్వంచ, విశాలభారతి:** పాల్వంచ పట్టణంలోని జాతీయ రహదారి పక్కన గల వేణుగోపాల్ థియేటర్ ప్రాంగణంలో పాల్వంచ కళా పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సర - 2026, ఉగాది వేడుకల చివరి రోజు ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు, సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు కోనేరు చిన్ని (సత్యనారాయణ),ముత్యాల విశ్వనాథం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అహుతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతు ఎన్నో వ్యయప్రయాసల కోర్చి ఎలాంటి ఆటంకం లేకుండా రాష్ట్రం నలుమూలల నుండి కవులు, కళాకారులను ఉత్సవాలకు హాజరయ్యేలా చేసిన నిర్వాహకుల కృషిని అభినందించారు.అదేవిధంగా కార్పొరేటర్లను సన్మానించి,కళాకారులకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు నాగా సీతారాములును పట్టు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళా పరిషత్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బిక్కసాని సుధాకర్, అధ్యక్షుడు మంతపురి రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి వేముల కొండలరావు, డాక్టర్ బుచ్చయ్య, లింగమూర్తి, నాయుడు, రమేష్,ఎల్లారెడ్డి, వ్యాఖ్యాతగా నరసింహ కుమార్,కార్పొరేటర్ లు మరియు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## న్యాయం కావాలి

**భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం గౌడ్**



**సికింద్రాబాద్, విశాలభారతి :** ప్రభుత్వానికి ప్రజలు ఇంటి పన్ను ఎందుకు కట్టాలని సత్యం గౌడ్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వాన్ని సూటిగా ఒక ప్రశ్న అడుగుతున్నాని, ఇది నేనే కాదు అందరూ కూడా అడగాల్సిన ప్రశ్నఅని, ఎందుకంటే మనం మోసపోతున్నాం. హౌస్ టాక్స్ ఇంటి పన్ను విషయంలో ప్రభుత్వం ప్రజలని మోసం చేస్తుందన్నారు. అంటే ఇప్పుడు మనకు గవర్నమెంట్ నల్ల నీళ్లు ఇస్తుంది కాబట్టి నల్ల టాక్స్, నల్లబిల్లు కట్టాల్సిందే. కరెంటు కూడా ఇస్తున్నారు కాబట్టి కరెంటు బిల్లు కట్టవలసిందే, పొద్దున్నే చెత్త వాడు వచ్చి చెత్త తీసుకెళ్తాడు, కాబట్టి చెత్త కూడా బిల్లు కట్టొచ్చు అది ok కానీ, మన ఇంటికి గవర్నమెంట్ ఏం చేస్తుందని ప్రతి సంవత్సరం ఇంటి టాక్స్ కట్టాలి. ల్యాండ్, స్థలం కొనుక్కునేటప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి పైసలు కట్టి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నాము. ఇల్లు కట్టుకునేటప్పుడే పర్మిషన్ల కోసం అని చాలా పైసలు కడుతున్నాము. ఒకవేళ ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్ వేస్తే దానికి తగ్గట్టుగా పర్మిషన్ తీసుకుని అమౌంట్ కడుతూనే ఉన్నాము. అయినప్పటికీ కూడా ప్రభుత్వం ఏమి చేస్తుందని మనం సంవత్సరానికి ఒకసారి ఇంటి టాక్స్ కట్టాలి. మనదేమైనా రాచరికమా, ప్రజాస్వామ్యమా, పరాయి పాలనలో ఉన్నట్టు అనిపించట్లేదా అని భాగ్యనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం గౌడ్ ప్రశ్నించారు .కాబట్టి ప్రతి ఒక్కరు కూడా ఈ విషయమై ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది కాబట్టి ప్రతీ ఒక్కరు ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిందిగా నేను కోరుతున్నానని, ప్రభుత్వాం కూడా ఈ ఇంటి టాక్స్ ను తీసేయవలసిందిగా డిమాండ్ చేస్తున్నానన్నారు.

## గండిపేట సరస్సులో విషాదం

**స్నానం చేయడానికి వెళ్లిన వ్యక్తి మృతి**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ గ్రామ సమీపంలో ఉన్న గండిపేట సరస్సు లో స్నానం చేయడానికి వెళ్లిన ఓ వ్యక్తి మునిగి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం, మహారాజ్ పేట్ గ్రామానికి చెందిన శ్రీనివాసులు (37) తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మధ్యాహ్నం సరస్సుకు వెళ్లాడు. ముందుగా ఆయనతో పాటు వెళ్లిన అంథమ్మ స్నానం చేసి సురక్షితంగా బయటకు వచ్చినప్పటికీ, అనంతరం నీటిలోకి దిగిన శ్రీనివాసులు తిరిగి బయటకు రాలేదు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ ద్వారా కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో, వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. మొదట ఫలితం లేకపోవడంతో State దిశస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సహాయం కోరారు. ఆదివారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకున్న DRF బృందం విస్తృతంగా శోధన చేపట్టి, శ్రీనివాసుల మృతదేహాన్ని సరస్సులో నుంచి వెలికి తీశారు. అనంతరం శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టం కోసం ఉస్మానియా హాస్పిటల్ కు తరలించారు. తర్వాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనతో మహారాజ్ పేట్ గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. మృతుడి కుటుంబ సభ్యులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు.

విశ్వనగరంగా వేగంగా రూపుదిద్దుకుంటున్న హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ప్రస్తుతం కీలక దశలో ఉంది. గత కొన్నేళ్లుగా ఐటీ రంగ విస్తరణ, విదేశీ పెట్టుబడులు, భారీ ఉద్యోగ అవకాశాలు నగరాన్ని దేశంలోనే అత్యంత ఆకర్షణీయ రియల్ ఎస్టేట్ గమ్యస్థానంగా నిలబెట్టాయి. ఈ నేపథ్యంలో 2026–27 తెలంగాణ బడ్జెట్ ఈ రంగానికి మరింత బలాన్నిచ్చే విధంగా రూపుదిద్దుకోవడం విశేషం. కేవలం నిధుల కేటాయింపులతో కాకుండా, నగర అభివృద్ధికి స్పష్టమైన దిశను నిర్దేశిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు రాబోయే ఐదేళ్లలో ఆస్తి విలువలపై గణనీయమైన ప్రభావం చూపనున్నాయి. - హైదరాబాద్, విశాలభారతి

# బడ్జెట్ భరోసా.. ఇన్‌ఫ్రా ధమాకా!

## తెలంగాణ బడ్జెట్‌తో ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు భారీ ఊతం

- మెట్రో ఫేజ్-2, మూసీ ప్రాజెక్ట్, ట్రిపులార్‌తో గ్రోత్ కారిడార్లు
- వెస్ట్ హైదరాబాద్ డామినీట్ చేస్తూ ఎదుగుతున్న ఈస్ట్ & సౌత్ సిటీ ప్రాంతాలు







### మార్కెట్ మూడ్

ప్రస్తుతం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను పరిశీలిస్తే, ఇది మాంద్యం దిశగా కాకుండా స్థిరీకరణ దిశగా సాగుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. గతంలో కనిపించిన వేగవంతమైన పెరుగుదల తర్వాత, మార్కెట్ ఇప్పుడు సహజమైన సమతౌల్యాన్ని సాధిస్తోంది. కొనుగోలుదారుల అభిరుచుల్లో గణనీయమైన మార్పు చోటుచేసుకుంది. తక్కువ ధరల గృహాలపై ఆధారపడిన మార్కెట్ ఇప్పుడు నాణ్యత, సౌకర్యాలు, ప్రీమియం జీవనశైలిపై దృష్టి సారిస్తోంది. లగ్జరీ అపార్ట్‌మెంట్లు, విల్లా ప్రాజెక్టులు, గేటెడ్ కమ్యూనిటీలు ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. ఐటీ ఉద్యోగులు, ఎన్ఆర్ఐలు, అధిక ఆదాయ వర్గాలు మార్కెట్‌ను ముందుకు నడిపిస్తున్నాయి. దీని ఫలితంగా ఒక కోటి రూపాయల పైబడిన ప్రాపర్టీల డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. ఇది హైదరాబాద్ మార్కెట్ పరిపక్వతను ప్రతిబింబించే ముఖ్య సూచికగా భావించవచ్చు.

### నగరం నలుమూలల వృద్ధి...

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వృద్ధి ఇప్పుడు ఒక్క వెస్ట్ జోన్‌కే పరిమితం కాదు. వెస్ట్ హైదరాబాద్‌లోని కోకాపేట, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలు ఇప్పటికీ టాప్‌లో ఉన్నప్పటికీ, ధరలు ఇప్పటికే గరిష్ట స్థాయికి చేరుకోవడంతో వృద్ధి వేగం కొంత తగ్గే అవకాశం ఉంది. ఈస్ట్ హైదరాబాద్ ఇప్పుడు కొత్త అవకాశాల కేంద్రంగా ఎదుగుతోంది. మెట్రో విస్తరణ, ఐటీ కంపెనీల విస్తరణ, మూసీ ప్రాజెక్ట్ ప్రభావంతో ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇది 'అండర్‌వాల్యూడ్ మార్కెట్'గా భావించబడుతోంది. నార్త్ హైదరాబాద్‌లోని కొంపల్లి వంటి ప్రాంతాలు ప్రశాంత నివాస వాతావరణంతో కుటుంబాలను ఆకర్షిస్తున్నాయి. సౌత్ హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, ఎయిర్‌పోర్ట్ సమీప ప్రాంతాలు కమర్షియల్ అవకాశాలతో ముందుకు వస్తున్నాయి.

### మౌలిక వసతులే కీలకం...

తెలంగాణ బడ్జెట్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి భారీ ప్రాధాన్యత ఇవ్వడం రియల్ ఎస్టేట్ రంగానికి ప్రత్యక్ష లాభాన్ని అందిస్తోంది. మెట్రో ఫేజ్-2 ప్రాజెక్ట్ నగర విస్తరణకు కీలక పాత్ర పోషించనుంది. ఎయిర్‌పోర్ట్ కారిడార్, పాతబస్తీ, ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు విస్తరించే మార్గాలు కొత్త పెట్టుబడులకు కేంద్రాలుగా మారుతున్నాయి. మెట్రో సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల ఆ ప్రాంతాల్లో ఆస్తుల విలువలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. మూసీ నది పునరుజ్జీవనం హైదరాబాద్‌కు కొత్త దిశను చూపిస్తోంది. ఉప్పల్, నాగోల్, చైతన్యపురి, పోచారం వంటి ప్రాంతాలు భవిష్యత్తులో కమర్షియల్ హబ్‌లుగా ఎదగనున్నాయి. నది తీర ప్రాంతాల్లో గ్రీన్ డెవలప్‌మెంట్, రివర్‌ఫ్రంట్ నిర్మాణాలు ఈ ప్రాంతాలను మరింత ఆకర్షణీయంగా మార్చనున్నాయి. రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్ట్ శివార్ల అభివృద్ధికి మార్గం సుగమం చేస్తోంది. ఇప్పటి వరకు దూరంగా భావించిన ప్రాంతాలు త్వరలోనే ప్రధాన అభివృద్ధి కేంద్రాలుగా మారే పరిస్థితి ఏర్పడుతోంది.

### మారుతున్న ఇన్వెస్టర్ల వ్యూహాలు...

ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడిదారులు తమ వ్యూహాలను మార్చుకోవాల్సిన అవసరం ఉంది. గతంలో వెస్ట్ హైదరాబాద్‌పై మాత్రమే దృష్టి సారించిన పెట్టుబడిదారులు ఇప్పుడు ఇతర జోన్లను కూడా పరిశీలిస్తున్నారు. మెట్రో కారిడార్లు, మూసీ పరిసర ప్రాంతాలు, రింగ్ రోడ్ ప్రభావిత ప్రాంతాలు పెట్టుబడులకు అనుకూలంగా కనిపిస్తున్నాయి. దీర్ఘకాలికంగా చూస్తే, శివారు ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్లు మంచి లాభాలను అందించే అవకాశముంది. అదే సమయంలో, తక్షణ లాభాల కోసం రెడీ-టు-మూవ్ ప్రాపర్టీలు కూడా మంచి ఎంపికగా నిలుస్తున్నాయి. పెట్టుబడిదారులు మౌలిక వసతుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకుంటే, మంచి రాబడులు పొందే అవకాశం ఉంది.



### ఎదుగుదలకు అడ్డంకులు...

రియల్ ఎస్టేట్ రంగం ఎదుగుతున్నప్పటికీ, కొన్ని సవాళ్లు కొనసాగుతున్నాయి. నిర్మాణ వ్యయం పెరుగుదల ప్రధాన సమస్యగా మారింది. సిమెంట్, ఇనుము ధరలు పెరగడం వల్ల ప్రాజెక్టుల ఖర్చులు పెరిగాయి. ఇది చివరకు వినియోగదారులపై ధరల రూపంలో పడుతోంది. అదేవిధంగా, మెట్రో ప్రాజెక్టుల అమలులో జాప్యం, మూసీ అభివృద్ధి ప్రణాళికలపై స్పష్టత లేకపోవడం వంటి అంశాలు పెట్టుబడిదారుల్లో కొంత అనిశ్చితిని కలిగిస్తున్నాయి. అయినప్పటికీ, ఇవి తాత్కాలిక సమస్యలేనని, దీర్ఘకాలంలో మార్కెట్‌పై ప్రభావం తక్కువగా ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు.

### ఇదే సరైన సమయం..

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఒక స్థిరమైన మరియు ఆరోగ్యకరమైన వృద్ధి దిశలో సాగుతోంది. ప్రభుత్వం చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టులు ఈ వృద్ధికి ప్రధాన ఆధారం. వెస్ట్ హైదరాబాద్‌కు పరిమితమైన అవకాశాలు ఇప్పుడు నగరం మొత్తం విస్తరించడంతో పెట్టుబడిదారులకు కొత్త మార్గాలు తెరుచుకున్నాయి. ప్రస్తుతం సరైన ప్రాంతాన్ని ఎంచుకుని పెట్టుబడి పెట్టగలిగితే, రాబోయే సంవత్సరాల్లో గణనీయమైన లాభాలు పొందే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు వేగంగా అమలవుతున్న ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టడం మంచి వ్యూహంగా మారుతోంది.



## జీవితాన్ని కళ్లకుకట్టే

# బయోపిక్ ఇది

మహారాష్ట్ర మహోన్నత జానపద కళాకారిణి, దేశభక్తురాలు విఠాబాయి భౌమాంగ్ నారాయణగాంకర్ జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న బాలీవుడ్ పానిండియా చిత్రం 'విఠా'. ఇందులో విఠాబాయిగా శ్రద్ధాకపూర్ కనిపించనున్న విషయం తెలిసిందే. మరాఠీ దర్శకుడు సంజయ్ జాదవ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని లోక్‌మాన్య ప్రొడక్షన్స్ నిర్మిస్తున్నది. ఇదిలావుంటే.. విఠాబాయి పాత్ర గొప్పదనం గురించి ఇటీవల శ్రద్ధాదాస్ మాట్లాడుతూ 'పుణ్యం చేసుకుంటే తప్ప ఇలాంటి పాత్రలు దక్కవు. ఈ విషయంలో నేనెంతో ఆనందిస్తున్నా, గర్విస్తున్నా. విఠాబాయి గురించి పూర్తిగా తెలుసుకున్న తర్వాత ఒక నటిగా నాకు ఇంతకు మించిన ఛాలెంజ్ మరొకటి లేదని అర్థమైంది. కళను ఓ తపస్సుగా, వేదికను ఓ దేవాలయంలా భావించిన గొప్ప కళాకారిణి విఠాబాయి.స్టేజ్‌పై ప్రదర్శన ఇస్తుండగా ప్రసవవేదన మొదలైతే.. ఏమాత్రం తడబడకుండా, వేదిక వెనక్కు వెళ్లి, ఓ బిడ్డకు జన్మనిచ్చి, సర్జికల్ పరికరాలు అందుబాటులో లేకపోవడంతో రాతితో బొడ్డు పేగును కోసి, బిడ్డను భద్రం చేసి, ఆ వెంటనే ఏమీ జరగనట్టుగానే తిరిగొచ్చి, మిగిలిన ప్రదర్శనను పూర్తిచేసిన గొప్ప కళాకారిణి విఠాబాయి. భారత్-చైనా యుద్ధ సమయంలో ఆమె కళారూపాలు జనంలో దేశభక్తిని పురిగొల్పాయి. యుద్ధభూమిలో అలసిన సైనికులకు విఠాబాయి ప్రదర్శనలు మానసిక ఉల్లాసాన్నిచ్చాయి. జానపద కళల్ని బతికించడం కోసం ఆమె పడ్డ తపన, ఎదుర్కొన్న పేదరికం, సామాజిక వివక్ష ఇవన్నీ ఈ బయోపిక్ కళ్లకు కడుతుంది' అని తెలిపింది శ్రద్ధాకపూర్.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.